వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 01 సెప్టెంబర్ 2023


## కదులుతున్న రైలు నుంచి మహిళను తోసేసిన టిటిఇ

### తృటిలో తప్పిన ప్రమాదం...ఆలస్యంగా బయలుదేరిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్



**రాజంపేట అర్బన్, ఆగస్టు 31 ప్రభాతవార్త**

జనరల్ టిక్కెట్ తీసుకుని రిజర్వేషన్ బోగిలో ఎక్కిందనే కోపంతో ఓ మహిళా ప్రయాణికురాలిని టిటిఇ కదులుతున్న రైలు నుంచి తోసేసిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి గురువారం రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు రాజంపేట రైల్వేస్టేషన్‌కు రాత్రి 7.20 సమయం లో చేరుకుంది. ఓ మహిళ రైలు చివరలో ఉన్న ఎస్-2 రిజర్వేషన్ బోగిలో ఎక్కింది. టికెట్ పరిశీలనలో టిటిఇ ఆమె జనరల్ టికెట్ తీసుకుని రిజర్వేషన్ బోగిలో ఎక్కిందని ఆగ్రహించిన టిటిఇ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలోపు రైలు కదిలింది. తర్వాత స్టేషన్‌లో జనరల్ బోగిలోకి వెళతానని చెప్పినా వినకుండా మహిళను టిటిఇ రైలు నుంచి బయటకు తోసేయడంతో ఆమె ప్లాట్‌ఫాం మీద పడిపోయింది. ఎలాంటి గాయాలు కాలేదు. వెంటనే ప్రయాణికులు చైన్ లాగి రైలును నిలిపివేశారు. దీంతో ప్రయాణికులంతా రైలు దిగి టిటిఇపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి అదుపు తప్పుతోందని భావించిన రైల్వే అధికారులు రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లేందుకు సిగ్నల్ ఇచ్చారు. అనంతరం స్థానిక రైల్వే అధికారులు మహిళను ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. టిటిఇ నిర్వాకం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

## హోంగార్డు, మరో వ్యక్తిపై కత్తితో దాడి...కేసు నమోదు



**కలికిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

కలికిరి పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణపై మరియు మర్రికుంటపల్లె పంచాయతీ పాతహరిజనవాడకు చెందిన కె.శ్రీనివాసులుపై ఓ యువకుడు కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన కలికిరిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలికిరికి చెందిన విజయ్‌పై కలికిరి పంచాయతీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో నివాసం ఉన్న షామీర్ (25) అనే యువకుడు దాడి చేసి అతని వద్ద డబ్బులు లాక్కోవడం జరిగింది. ఆ విషయమై విజయ్ స్నేహితుడైన కె.శ్రీనివాసులు షామీర్‌ను ప్రశ్నించడం జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన షామీర్ కత్తితో శ్రీనివాసులుపై దాడి చేయడం జరిగింది. ఈ సమయంలో అక్కడే ఉన్న హోంగార్డు వెంకటరమణ షామీర్‌ను ఎందుకు దాడి చేస్తున్నావ్ అని ప్రశ్నించగా షామీర్ హోంగార్డుపై కత్తితో దాడి చేసి బీరు బాటిల్‌తో తలపై కొట్టాడు. దీంతో హోంగార్డుకు మరో వ్యక్తి శ్రీనివాసులకు కత్తి పోట్లు పడగా శ్యామూల్ అనే వ్యక్తి ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. సంఘటనా స్థలాన్ని ఇన్‌ఛార్జి సీఐ నాగేంద్ర, కలికిరి పోలీసులు సందర్శించి కె.శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు షామీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చిరుధాన్యాల సాగుపై రైతుల ఆసక్తి

### కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, అరికెలు, ఊదలు సాగు





**రాయచోటి ఆగస్టు 31, ప్రభాతవార్త**

మనుషుల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. చిరుధాన్యాల విలువేంటో సమాజానికి ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. కొర్రాల పాయసం, రాగి జావ లాంటి పేర్లు జనాల నాలుకల మీద తిరుగుతున్నాయి. ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటకు సార్థకత చేకూరుతోంది. గటకే తిన్నామో..! గంజే తాగామో..! అని మాట వరుసకు అంటుంటాం. పేదతిండి అని చెప్పడానికి వాడే ఉపమానం అది. నిజానికది గరీబు తిండి కాదు. నిఖార్సయిన తిండి. నిండైన తిండి. గంభీరమైన తిండి. శ్రీమంతుల తిండి. ఇంకా చెప్పాలంటే- చిరుధాన్యాలకు మించిన పౌష్టికాహారం- ఈ భూమండలం మీదనే లేదు. అందుకే ఒకప్పటి పచ్చజొన్నల గట్క మళ్లీ రారమ్మని పిలుస్తోంది. ఆనాటి రాగిజావ తిరిగి కళ్ల ముందు కదలాడుతోంది. కనుమరుగైన సామపాశం మళ్లీ సాహెూ అంటోంది. మచ్చుకైనా కనిపించని సజ్జ మలీదలు మిర్రిమిర్రి చూస్తున్నాయి. ఈ తరానికే తెలియని నూనె పోలెలు నున్నగా కవ్విస్తున్నాయి. ప్రాభవం కోల్పోయిన చిరుధాన్యాలు చిరునవ్వులు రువ్వుతున్నాయి. సన్నబియ్యం, బాసుమతి రైస్ తినడమే స్టేటస్ అనుకునే రోజులు పోతున్నాయి. దంపుడు బియ్యం ఎంత రేటున్నా సరే కొంటున్నారు. రాగి అంబలి తాగడానికి క్యూ కడుతున్నారు. ఎండాకాలం సామబియ్యం తింటే చలువ అని జనానికి అర్థమైంది. చలికాలం కొర్రబువ్వ తినాలని ఇప్పుడిప్పుడే అవగతమవుతోంది.

చిరుధాన్యాల సాగుతో రైతు ఇంట సిరులు కురువనున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి అధిక లాభాలను ఆర్జించవచ్చు. అన్నమయ్య జిల్లాలోని నేలలు కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, అరికెలు, ఊదల పంటల సాగుకు అనుకూలమని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అతి తక్కువ వర్షపాతం నమోదైనా పంట చేతికొస్తుందని పేర్కొంటున్నారు. జిల్లాలో చిరుధాన్యాల సాగుపై అధిక శాతం రైతులు ఆసక్తిని చూపుతున్నారు. ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెడితే 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. కిలో రూ.60 నుంచి రూ.70 వరకు ధర పలుకుతుండగా, క్వింటాలుకు రూ. 6వేల నుంచి రూ. 7వేల వరకు వస్తుంది. అంటే ఎకరాకు దాదాపు రూ.70 వేలకుపైగా ఆదాయం సమకూరనున్నది. రైతుల్లో అవగాహన పెంచి ఈ అన్నమయ్య జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచేలా వ్యవసాయ శాఖ కృషి చేస్తున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో మారిన ఆహారపు అలవాట్ల వల్ల పెరుగు తున్న ఊబకాయం, అనారోగ్య సమస్యలతో తిరిగి తృణ ధాన్యాలకు ప్రాధాన్యం పెరిగింది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సైతం తృణధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే దిశగా రైతులు చిరు ధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇతర పంటల కన్నా ఖర్చు తక్కువ...ఆశించిన స్థాయిలో దిగుబడులు కూడా రావడంతో వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. చిరుధాన్యాల ప్రాముఖ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్నది. పూర్తి స్థాయిలో ప్రజల్లో అవగాహన వస్తే వీటి వినియోగం కూడా పెరుగుతుంది. తేలికపాటి నేలల్లో అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో కొర్ర పంటను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లా పరిధిలో తృణ ధాన్యాల సాగు రెండు సంవత్సరాలుగా పెరుగుతున్నది. జిల్లాలో 1,520 ఎకరాల్లో జొన్న, రాగులు, కొర్రలు, సజ్జలు సాగు జరుగుతుంది. 7 రకాల తృణధాన్యాలు ఉండగా.. వాటిలో జొన్న, రాగులు, కొర్రలు, అక్కడక్కడ సామలు పండిస్తున్నారు. జిల్లాలోని 11 మండలాల్లో ఈ రబీ నందు 320 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేశారు. జిల్లాలో అదనంగా తృణధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడానికి అధికా రులు ప్రణాళికాబద్దంగా ముందుకు సాగుతున్నారు.

# విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్న రైతన్నలు



**ఖాజీపేట ఆగస్టు 31, ప్రభాతవార్త**

ఖాజీపేట మండలంలో అనధికార విద్యుత్ కోతలతో రైతులు అల్లాడిపోతున్నారు. సాధారణంగా ఈ మాసంలో వర్షాలతో కాలువలకు వచ్చే నీళ్లతో పంట పొలాలన్ని కలకళలాడేవి.కానీ ప్రస్తుతం వర్షాలు రాక వాతావరణం వేసవిని తలపిస్తోంది. రైతన్న ఆశలు చావక తమకు బోరు ఉంది కదా వర్షాలు పడేవరకు బోరునీళ్లతో పంటకునీటి వసతి కల్పించుకుందాం ఆలోపు వర్షాలు ఆదుకుంటాయి అన్న తలంపుతో పంటలని సాగుచేశాక అసలు ఇక్కట్లు ప్రారంభమయ్యాయి. వరుణదేవుడు కరుణించకపోయినా బోరు కరుణిస్తుందిలే అనుకున్న రైతులపై విద్యుత్ అధికారుల రూపంలో శరాఘాతం తగిలింది. మండలంలో అనధికార విద్యుత్ కోతలు మరీ ఎక్కువయి నీళ్లపారకంలో తడిచిన నేలనే మళ్ళీ తడుపుకుంటూ బోర్లున్నప్పటికీ పంటకి పూర్తి స్థాయిలో నీరు ఇవ్వలేక పంట ఎండిపోతుంటే చూడలేక రైతులు రోధిస్తున్నారు. విద్యుత్ సరఫరా లేక రైతన్నలు సాగుచేసిన పంట దక్కుతుందో లేదో అని రైతన్నలు దిగాలు చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇటు వర్షాలు లేక అటు కేసీ కెనాల్ కు నీరు రాక ఉన్న బోర్లలో పంట సాగు చేసుకుందామనుకుంటే విద్యుత్ కోతలతో రైతన్నలు చాలా ఇబ్బందులు పడుతున్నారు . గతంలో ఖాజీపేటలో రెండు మూడు సబ్ స్టేషన్ లు ఉన్నప్పుడు విద్యుత్ సరఫరా ఎలా ఉండేదో ఆరు సబ్ స్టేషన్లు ఉన్నప్పుడు కూడా సరఫరా అలానే ఉంది.రైతులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా కావడం లేదు . మండల పరిధిలో అరటి వరి పసుపు ఉల్లి సంపంగి పంటలు సాగు చేశారు ఈ పవర్ కట్ ఇలాగే కొనసాగితే సాగు చేసిన పంటలు ఎండిపోక తప్పదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని రైతన్నలు కోరుకుంటున్నారు. ఇక గృహాలకి సరఫరా చేసే విద్యుత్ గురించి చెప్పుకోవాల్సిన అవసరం లేదు .ఖాజీపేట పట్టణంలో ప్రైవేట్ సిబ్బంది ఆగడాలతో విసిగి వేశారుతూ ప్రతి చిన్న పనికీ సరఫరా పూర్తిగా నిలిపేస్తూ , అప్రకటిత కోతలతో మండల ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో కూడా విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతో దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు . పొరబాటున రాత్రివేళల్లో కరెంటు పోతే గంటల తరబడి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దయఉంచి విద్యుత్ ఉన్నతాధికారులు ఈ అప్రకటిత అనధికార విద్యుత్ కోతలని అరికట్టి రైతులకు ప్రభుత్వం చెప్పినట్లు గా తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ ని అలాగే పట్టణంలోని సిబ్బందిని గాడిన పెట్టి సరైన విద్యుత్ సరఫరాను అందివ్వాలని మండల ప్రజలు ముఖ్యంగా రైతులు కోరుతున్నారు.

# యువగళం సంఘీభావ యాత్రలో తెలుగు తమ్ముళ్లు

**గాలివీడు ఆగస్టు 31, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘీభావం తెలుపుతూ మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌కుమార్ రెడ్డి, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో గురువారం గాలివీడు పట్టణంలో చేపట్టిన పాదయాత్రలో తెలుగు తమ్ముళ్ల కదం తొక్కారు. ముందుగా మండల కేంద్రములోని గాలివీటి గంగమ్మ ఆలయం లో పూజలు నిర్వహించి బస్టాండ్‌లోని పూల అంగళ్ళు వద్ద స్వర్గీయ నంద మూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాలుగురోడ్ల కూడలి మీదుగా ఆర్.ఆర్ కళాశాల వరకు సంఘీభావ యాత్ర సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు,వీది దీపాలు, కాలువలు, చెరువులు, మౌళిక వసతులు కల్పించి అభివృద్ధికి నాంది పలికింది తెలుగుదేశం పార్టీనే అని గుర్తుకు చేశారు. నాలుగున్నర సంవత్సరాలు అధికారంలో వున్న వైకాపా పార్టీ నవరత్నాలు అనే పేరుతో నిరుపేదలకు పేళాలు జల్లి రత్నాలు, డబ్బులు నాయకులు దోచుకున్నారని ఎద్దేవాచేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అవినీతి పరాకాష్టకు చేరిందన్నారు. ఇసుక దొరక్క కార్మికులు, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా దీనమైన స్థితిలో రైతులు,ఇంకా ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వం నుండి ఆదరణ కరువై అసమ్మతితో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. మరోవైపు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు అమాంతం పెంచేసి మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల దృష్ట్యా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మహాశక్తి అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చి పెరిగిన ధరలకనుగుణంగా ప్రతీ మహిళకు రూ.1500,ప్రతీ విద్యార్థికి రూ.15000, రైతులకు రూ.20,000, నిరుద్యోగులకు రూ.3000 నగదుతో పాటు 20 లక్షల ఉద్యోగాలను ఇచ్చేలా మహానాడులో తీర్మానం చెయ్యడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమాలను ప్రతీ టీడీపీ కార్యకర్త, నాయకులు ఇంటింటికీ ప్రజల్లోకి తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. నిరుపేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్, చంద్రన్న భీమా ద్వారా ప్రమాద వశాత్తు చనిపోయిన వారి కుటుంబానికి రూ.5 లక్షలు వచ్చే పథకా లను రద్దు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.మైనారిటీలకు సంభందించి దుల్హన్, రంజాన్ తోఫా పథకాలను ఆటకెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు,మండల నాయకులు,అన్ని గ్రామాల టి. డి.పి.నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి 2లో

కృష్ణంపల్లెలో భవిష్యత్తుకు గ్యారెంటీ 4 లో


# చెంచులకు కులధ్రువీకరణ పత్రాలు పంపిణీ

### గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా





**కడప ఆగస్టు 31, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చెంచుల 40 సంవత్సరాల సమస్యను పరిష్కరించి చెంచు కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయడం జరిగిందని, ఇక పేద చెంచుల గడప గడపకువెళ్లి సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా..48/1 వ డివిజన్ రామరాజుపల్లి, సచివాలయం-1లోని ఏ.ఎస్.ఆర్.నగర్ హెూమియోపతి కాలేజి వద్ద గల చెంచునగర్ కాలనీ లోని పలు ప్రాంతాలలో పర్యటన. స్థానిక 48/1 వ డివిజన్ ఏ.ఎస్. ఆర్. నగర్ హెూమియోపతి కాలేజి వద్ద గల చెంచునగర్ కాలనీ లోని పలు ప్రాంతాలను సందర్శించారు.

గురువారం స్థానిక 48/1 డివిజన్ కార్పొరేటర్ మసీమ బాబు ఇంఛార్జి ఆధ్వర్యంలో సచివాలయం- పరిధిలోని ఏ.ఎస్.ఆర్.నగర్ హెూమియోపతి కాలేజి వద్ద గల చెంచునగర్ కాలనీలోని పలు వీధులు, ప్రాంతాలలో లిగడప గడపకూ మన ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తొలుత హెూమియోపతి కాలేజి వద్ద చెంచు నగర్ కాలనీలోని ఆంజనేయ స్వామి గుడి నుండి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా ప్రారంభించారు. 48/ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ ఇంచార్జి మరియు టిటిడి బోర్డు మెంబెర్ మసీమ బాబు, కాలనీవాసులు లిగడప గడపకూ మన ప్రభుత్వం" కార్యక్రమానికి ఎస్.బి.అంజాద్ బాషాకు ఘనంగా స్వాగతం పలి కారు. స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి.. ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వార్డులోని అన్ని ఇళ్లకు తిరు గుతూ కుటుంబాలను కలుసుకోవడంతో పాటు, వారు పొందుతున్న లబ్ది సమా చారంతో కూడిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్‌లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రతి కుటుంబం లబ్ది చేకూరిందని ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకా లను అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.

**చెంచులకు కులధ్రువీకరణ పత్రాలు పంపిణీ**

తొలుత ఏ.ఎస్. ఆర్. నగర్ కాలనీ చెంచు (ఎస్. టి.) లు తాము కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివాసిస్తున్నామని అలాగే కొన్ని ఏళ్లుగా చెంచు కులమునకు చెంచు కులధృవీకరణ పత్రం లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు అందడం లేదని, తమ కాలనీ వాసులకు స్మశానవాటిక లేదని, మురికి కాలువలు, రోడ్లు లేవని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సం క్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్ బి. అంజాద్ బాషాకు విన్నవించగా, ఆయన వెంటనే స్పందించి కడప తహసిల్దార్ శివరామి రెడ్డికి వెంటనే చెంచు (ఎస్‌టి) కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి. అంజాద్ బాషా చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్ బి. అంజాద్ బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కడప నగరం ఏ.ఎస్. ఆర్. నగర్ కాలనీ చెంచుల 40 సంవత్సరాల సమస్యను పరిష్కరించి చెంచు కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయడం జరిగిందని, ఇక పేద చెంచుల గడప గడపకువెళ్లి సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందని అన్నారు.

40 సంవత్సరాల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సాకారం కావడం మనందరి అదృష్టమని, ఆయనను కలకాలం గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అక్కడి చెంచు వాసులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్ బి. అంజాద్ బాషాకి పూలమాలలతో, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అంజాద్ బాషాకి, కడప తహసిల్దార్ శివరామిరెడ్డికి, బంగారు నాగయ్య యాదవ్‌కు కృతజ్ఞతాభివందనాలు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, అంజాద్ బాషాకి, కడప తహసిల్దార్ శివరామిరెడ్డికి, బంగారునాగయ్య యాదవ్ లకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపముఖ్య మంత్రితో పాటు కార్పొరేటర్ ఇంఛార్జి, టిటిడి బోర్డు మెంబెర్ మసీమ బాబు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, మార్కెట్ యార్డు ఛైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, కార్పొరేటర్లు షేక్ ..మహమ్మద్ షఫీ, వైకాపా నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, అహమ్మద్, పస్తం అంజి, పెద్దిరెడ్డి రామ్ మోహన్ రెడ్డి, రహీం, చాక్లెట్ గౌస్, ఇలియాస్, పవర్ అల్తాఫ్, సయ్యద్ హాజరత్ పీరం మున్నా, నాయకురాళ్లు టి.వి సుబ్బమ్మ, మరియలు, సుశీలమ్మ, నగర కార్పొరేటర్లు సభ్యులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు జగనన్న

### గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఏ శ్రీకాంత్‌రెడ్డి

**రామాపురం ఆగస్టు 31, ప్రభాతవార్త**



అభివృద్ధి, సంక్షేమానికి మారు పేరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని, మాట తప్పని నాయకుడిగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయడంలో దేశానికే జగనన్న ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామ పంచాయతీలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. బిసి కాలనీ, నల్లగుట్టపల్లె కస్పా, కొత్తపల్లె లలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, ప్రజా సమస్యలుపై ఆరా తీశారు. ఎంఎల్ఏకి ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు, అపూర్వ ఆదరణ లభించాయి.పండుగ వాతావరణంలో సాగిన గడపగడపకు మన ప్రభుత్వం కొనసాగింది. ప్రజలతో మమేక మవుతూ, సమస్యలపై ఆరా తీస్తూ.. ప్రభుత్వ పథకాలను శ్రీకాంత్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర లా నిలిచిపోయారని అన్నారు. మరోమారు జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజాధరణలో తండ్రికి మించిన తనయుడిగా జగన్మోహన్ రెడ్డి పేరు ప్రఖ్యా తులు సంపాదించుకున్నారన్నారు. బిసిల హృదయంలో జగన్, జగన్ హృద యంలో బిసిల ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం హృద్య మైన సన్నివేశాలకు వేదిక అవుతోంది. ఒకరు కృతజ్ఞత చెప్పుచున్నారు. మరొకరు ఆనంద బాష్పాలు రాల్చుతున్నారు.. ఇంకొకరు మనసారా దీవిస్తున్నారు. నాలుగేళ్ళ పాలనను వివరిస్తూ శ్రీకాంత్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ రెండు, మూడు పథకాలు అందినాయంటూ సంతోషంగా లబ్ధిదారులు చెప్పున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి జడ్పిటిసి మాసన్న వెంకటరమణ మండల కన్వీనర్ గడి కోట జనార్దన్ రెడ్డి, సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి కేపిఆర్ కన్స్ట్రక్షన్ యజమాని క్లాస్ వన్ కాంట్రాక్టర్ పెంచల్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, వైస్ ఎంపిపి రవిశంకర్ రెడ్డి (బాబు), హస్తకళల డైరెక్టర్ హుసేన్, యువజన విభా గపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, స్థానిక నాయకులు చెన్నారెడ్డి, శ్రీధర్ రెడ్డి, భక్త వత్సల రెడ్డి, సత్యా యాదవ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

# క్రికెట్ స్టేడియం పనులను వేగవంతం చేయండి : కలెక్టర్

**రాయచోటి ఆగస్టు 31, ప్రభాతవార్త**



క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సంబందిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి పట్టణంలోని శివారు ప్రాంతమైన నక్కావాండ్లపల్లి సమీపంలో జరుగుతున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... అక్టోబర్ 2 కల్లా క్రికెట్ స్టేడియం అన్ని హంగులతో అత్యంత సుందరంగా పూర్తి చేయాలని పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. క్రికెట్ స్టేడియం వరకు రోడ్డు నిర్మాణ పనులు, ఆర్చి నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. స్టేడియం నందు చూపరులను ఆకట్టుకునేలా మొక్కలు విరివిగా నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. మైదానం చుట్టూ నీడనిచ్చే పెద్ద పెద్ద మొక్కలను నాటలన్నారు. దాదాపు 32 ఎకరాలలో నిర్మించే స్టేడియం నిర్మాణ పనులన్నీ నాణ్యతతో మన్నికగా ఉండేలా చేపట్టాలన్నారు. రోడ్డు నిర్మాణం, స్టేడియం సరిహద్దుల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం ఏర్పాటు తదితరాలపై రెవిన్యూ, ఆర్అండ్బి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రికెట్ స్టేడియంలో కలియతిరిగి పిచ్ నిర్మాణం, అక్కడ నిర్మిస్తున్న గదులను పరిశీలించి శరవేగంగా స్టేడియం పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు. స్టేడియం మొత్తం రైన్ గన్‌తో తడిపి ఎత్తు పల్లాలు లేకుండా చూడాలన్నారు. రెవిన్యూ, ఆర్అండ్బి, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి అన్నమయ్య నూతన జిల్లాలో మంచి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ సాధవరెడ్డి, డిఈ వెంకటసుబ్బయ్య, తహసిల్దార్ ప్రేమంత్ కుమార్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి

**పులివెందుల రూరల్, ఆగస్టు 31, ప్రభాతవార్త :**



పులివెందులలోని రింగ్ రోడ్డులో ఉన్న శ్రీక్రిష్ణ దేవాలయం వద్ద గురువారం బైకు, స్కార్పియో ఢీకొని భార్య భర్తలు మృతిచెందగా మరో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు ముదిగుబ్బకు చెందిన బాల కుళ్లాయప్పకు కడుపునొప్పి రాగా వైద్యం కోసం పులివెందుల మండలంలోని కానేపల్లె నుండి పులివెందులకు బయలుదేరారు. మార్గమద్యంలో శ్రీకృష్ణ దేవాలయం వద్ద అతివేగంగా వచ్చిన స్కార్పియో రోడ్డు దాటుతున్న బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వలి, రమీజా దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో వీరికి ఉన్న ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## విధులకు హాజరు కాని వర్కర్స్‌ను సస్పెండ్ చేయాలి

**కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 31, ప్రభాతవార్త:**




జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్టవీధిలో ఉన్న ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో నారాయణమ్మ వంట మనిషిగా పని చేస్తోంది. కానీ ఈమె విధులకు హాజరు కాకుండా బినామీ వర్కర్‌గా పుల్లమ్మ అనే ఆమెను నియ మించుకొని విధుల దుర్వినియోగానికి పాల్పడుతూ వేలకు వేలు (70వేలు) ప్రజా ధనాన్ని లూటీ చేస్తోందని వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసు కోవాలని ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆమెకు కేవలం 4500 ఇస్తూ ఆమె కూడా పని చేయకుండా కేవలం హాజరై పోయే విధంగా హుకుం జారీ చేస్తోందన్నారు. వర్కర్ ఆదినారాయణమ్మ నిర్లక్ష్యంగా వ్యవహ రి స్తోందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి మనిషిని, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ సరస్వతి మా తోడికోడలు బంధువులమని వార్డెన్‌ను, వర్కర్‌ను, విద్యార్థినిలను ఏఎస్‌డబ్ల్యూఓను బెదిరిస్తూ విధులకు హాజరుకాకుండా భయాం దోళనకు గురి చేస్తూ అతి త్వరలోనే నాకు క్లాస్‌ఫోర్ నుంచి వార్డెన్‌గా ప్రమోషన్ ఇస్తానని జేడీ చెప్పిందని, ఇకమీదట మీరందరూ నా పరిధిలో ఉండాలని నేనఉ ఎలాంటి విధులకు హాజరు కాను, నేను ఎలాంటి పనులు చేయను నన్ను మీరు అడిగినా, నా మీద ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్థానిక ఎమ్మెల్యే, మా అక్క జేడీ సరస్వతి మేడంకు ఒక ఫోన్ చేస్తే మీరందరూ ఇంటికి వెళ్తారని బెదిరింపులకు దిగుతోందని వారు మండిపడ్డారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు అజయ్, శీను, వినయ్ పాల్గొన్నారు.

## తెదేపా నేతలపై అక్రమ కేసులా..?

**జమ్మలమడుగు, ఆగస్టు 31, ప్రభాతవార్త:**



అంబవరం ఇసుక క్వారీకి అనుమతులు లేకున్నా అక్రమంగా జేసీబీలు, టిప్పర్లు పెట్టి తరలిస్తూ తెదేపా రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు మంగళవారం ఇసుక క్వారీ వద్ద శాంతి యుతంగా నిరసన తెలి య జేస్తున్న తెదేపా జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవగుడి భూపేష్ సుబ్బరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి శివనాథ్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి జంబాపురం వెంకట రమణా రెడ్డితో పాటు 15 మందిపై అక్రమంగా కేసు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమే అని ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ ఛైర్మన్, తెదేపా రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మలమడుగులోని తెదేపా కార్యాలయంలో గురు వారం తన సోదరుడు చంద్ర శేఖర్‌రెడ్డితో కలిసి భూపేష్‌రెడ్డి, దేవగుడి శివనాథ్ రెడ్డి, జంబాపురం రమణారెడ్డి, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ లూరు శ్రీనివాసులు, తెలుగు రైతు జిల్లా ప్రదాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికా ర్జునను పరామర్శించారు. జరిగిన సంఘటనపై తెదేపా నేతలతో చర్చించారు.

## స్వాతంత్ర్య సమరయోధుడునికి రాఖీ బంధన్..

**కడప కార్పొరేషన్, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

రాఖీ పౌర్ణమి పండగ శుభ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు పెద బల్లి బాల ఎల్లారెడ్డి(102)కు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్ రాఖీ బంధన్ కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదబల్లి బాల ఎల్లారెడ్డి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. రాత్రి వర్షం కురుస్తున్న వేళలో కొండపేట-చెన్నూరు మధ్య ఉన్న వంతెనను 15 మందితో కలిసి కూల్చివేశారు. దీనికి 10 వాయిదాలతో 3 నెలలు కడప సబ్ జైలులో శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్‌జీ, జిల్లా ప్రచారక్ శేష, డా.సాగర్, కుళాయిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం : సిపిఐ

**కమలాపురం, ఆగస్టు 31, ప్రభాతవార్త:**



రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు కేంద్రంలో ఉన్న అనేక ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని కేంద్రంలో నరేంద్ర మోదీ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మితమైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అడ్డుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఓబులేసు, జి.ఈశ్వరయ్య అన్నారు. గురువారం కమలాపురం అడ్డరోడ్డు వద్ద నియోజకవర్గ సీపీఐ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాగ్దా నాలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, విభజన చట్టాల హామీలను తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గభవానీ, శివాం రెడ్డి, ఏపీ ప్రజానాట్యం, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చంద్రనాయక్, పెంచలయ్య, రామ కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బషీరున్నీషా, వెంకట శివ, విజయ లక్ష్మీ, జిల్లా నాయకులు వలరాజా, సుభాషిని, వెంకట రమణ, వరప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, అమ్ములు, మరియమ్మ, వరలక్ష్మీ, అనిత, జయ కుమారి, గంగయ్య పాల్గొన్నారు.

## యువగళం పాదయాత్రకు 200 రోజులు

**కమలాపురం, ఆగస్టు 31, ప్రభాతవార్త:**



టీడీపీ యువనేత నారా లోకేష్ పాద యాత్ర చేపట్టి 200 రోజులు పూర్తి యిన సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని మద్దతుగా ర్యాలీ నిర్వ హించారు. మండల నాయ కుడు రాఘవరెడ్డి, ఆసుపత్రి మాజీ ఛైర్మన్ జంపాల నరసింహారెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా, టీడీపీ రాష్ట్ర రైతు సంఘం నాయకులు మల్లికా ర్జునరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వాసుదేవరెడ్డి, రాష్ట్ర కాపు నాయకుడు నీలం నరేంద్ర, ఎర్రగుడిపాడు రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, చెన్నూరు అక్బర్, శ్రీనివాస్‌రెడ్డి కమలాపురం క్రాస్‌రోడ్డు నుంచి పాదయాత్ర చేపట్టారు.

## ఎఫ్‌బీలో పోస్టులు పెట్టినందుకే మాపై దాడి

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేస్తున్న ఇసుక అక్రమ రవాణా గురించి ఫేస్ బుక్‌లో పోస్టులు పెట్టానని నన్ను కిడ్నాప్ చేసి దాడి చేశారని శ్రీనివాసులు రెడ్డి, గంగవరం శేఖర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం వైఎస్‌ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాతో పాటు మా నాయకుడు గంగవరం శేఖర్‌రెడ్డిని కూడా చంపుతామని ఫోన్‌లో బెదిరించారన్నారు. నా కిడ్నాప్‌పై ఎమ్మెల్యే పాత్ర ఉందని ఆరోపించారు. ఈ కిడ్నాప్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు.

## హత్య కేసులో నిందితుడు అరెస్టు

**దువ్వూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని నేలటూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాల వెనక వైపున బండ్లబాట దారిలో ఆగస్టు 27వ తేదీ హత్యకు గురైన చిన్నమూగోళ్ల గంగయ్య కేసులో నిందితుడైన డి.కేశవ్‌ను గురు వారం అరెస్టు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు కేశవ్ అనే వ్యక్తి బి.మఠం మండలం పెద్దరాజుపల్లె గ్రామానికి చెందినవాడు. అతను భార్య బిడ్డలను వదిలి నేలటూరులోని అక్క కేశమ్మ ఇంటికి వచ్చాడు. కేశమ్మ కూతురు భవాని తన భర్తను వదిలి ఇంట్లో ఉండగా కేశవ్ గత 8 నెలల నుంచి సహ జీవనం చేస్తున్నట్లు విచారణలో పేర్కొన్నారు. భవాని గంగయ్యతో కూడా వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని మనసులో ఉంచుకొని ఈనెల 27వ తేదీన గంగయ్యను కేశవ్ కత్తితో దాడి చేశాడని దీంతో గంగయ్య మరణించినట్లు తెలిపారు. కేశవ్ నుంచి మోటారు సైకిల్, హత్యకు ఉపయోగించిన కత్తిని, జత బట్టలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేవలం వివాహేతర సంబం ధాలతోనే ఈ సంఘటన జరిగిందని సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు. నిందితుడిని అరెస్టు చేయడంతో జిల్లా ఎస్పీ సీఐని, ఎస్సైని, దువ్వూరు సిబ్బందిని అభినందించారు.

## జగనన్న భూ హక్కు పత్రాలను అందించిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

**కమలాపురం, ఆగస్టు 31, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని దేవరాజుపల్లె పంచాయతీలో గురువారం సచివాలయం వద్ద జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను ఆ గ్రామంలో దాదాపు 30 మంది రైతులకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి భూ యజమానికి ఇబ్బంది లేకుండా మంచి ఉద్దేశంతో బృహత్తరమైన కార్య క్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ పాదయాత్ర 200 రోజులు పూర్తి

### - మద్దతు తెలిపిన వి.ఎస్.అమీర్‌బాబు

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 31, ప్రభాతవార్త:**



కడప నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో గురువారం తెదేపా యువ నేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులకు చేరుకోవడంతో భారీ సంఘీభావ యాత్ర చేపట్టారు. బ్యాండ్ మేళాలతో, టపాసులు, డీజే సౌండ్, పుష్పాలతో రెండో గాంధీ బొమ్మ దగ్గర నుంచి అల్మాస్‌పేట సర్కిల్ వరకు వందలాది మంది కార్యకర్తలతో నాయకులతో కలిసి పాదయాత్ర చేస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ఈ అరాచక ప్రభుత్వం గురించి, ఈ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజలందరిపైన చేస్తున్న దాడుల గురించి వివరిస్తూ వెళ్లారు. కార్య క్రమంలో అధిక సంఖ్యలో తెదేపా నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సంబరాలు చేసుకున్న తెదేపా నాయకులు**



నారా లోకేష్ పాదయాత్ర 200 రోజులు పైర్తయిన సందర్భంగా తెలుగు యువత ఆధ్వర్యంలో నగరంలో రాజాఖాన్ బాగ్ మసీదు వద్ద గల ఎక్సైడ్ బ్యాటరీ షోరూంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నగర ఉపాధ్యక్షులు మహ్మద్ షా, పార్టీ మైనార్టీ నాయకుడు సయ్యద్ నాయబ్, తెలుగు యువత నాయకులు సంపత్, ధీరజ్, తేజ, షేక్‌షా, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ సార్వభౌమాధికార రక్షణలో ప్రధాని మోదీ విఫలం

### పఠాన్ మహ్మద్ అలీఖాన్

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 31, ప్రభాతవార్త:**



భారతదేశ సార్వభౌమాధి కారంలో అంతర్భాగంగా ఉన్న అరుణాచల ప్రదేశ్ రాష్ట్రం, అక్సాయ్ చిన్ ప్రాంతాలను తమవేనంటూ చైనా ప్రభుత్వం ఇటీవల అధికారికంగా ప్రకటిం చిందని ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు పఠాన్ మహ్మద్ అలీఖాన్ తెలిపారు. చైనా ప్రభుత్వం చేసిన ఈ దుస్సాహసాన్ని నిలువరించడంలో కాకుండా అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర రక్షణలో కూడా ప్రధాని మోదీ పిరికితనం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో బబీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా చైనా దుస్సాహసాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. మోదీ దేశాన్ని అదోగతి పాలు చేయడం దారుణమని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బిజెపి దాని మూక సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో కడప కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ ఛైర్మన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో ముద్దాయిలకు శిక్ష

**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు మున్సిపల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులకు ఆటంకపరిచి బెదిరించి నందుకు ఇద్దరు ముద్దాయిలకు సంవత్సరం జైలు శిక్ష రూ.5వేలు జరిమానాను రాజశ్రీ అడిషనల్ జుడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రొద్దుటూరు కోర్టు విధించింది. సాక్షాధారాలతో శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 2వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఇత్తడి శ్రీనివాసులు 2018 మార్చి 3న ప్రొద్దుటూరు 2వ పట్టణ పోలీసు స్టేషన్‌కు వచ్చి రాత్రి 9 గంటలకు తన విధి నిర్వహణలో భాగంగా ప్రజారోగ్యం దృష్ట్యా ప్రొద్దుటూరు టౌన్, ఆంధ్రకేసరి రోడ్డులో పెద్ద గుంత వద్ద యజమాని లేని పందులు పట్టుకొని తరలిస్తు ఉండగా ప్రొద్దుటూరు వివేకానంద కాలనీకి చెందిన కాసారపు చిన్న వెంకటసుబ్బయ్య అతని అమ్మ రమణమ్మలు ఈ కేసులో ఫిర్యాది అయిన ప్రొద్దుటూరు మున్సి పాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వద్దకు వెళ్లి పందులు పట్టకుండా విధులకు అడ్డుపడి అతనిని బెదిరించారని ఫిర్యాదు చేయగా వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో సాక్షాధారాలతో ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ముద్దాయిలను కడప సెంట్రల్ జైలుకు తరలించడం జరిగింది.

## ఏపీఎన్‌ఆర్టీఎస్ సేవలు ప్రశంసనీయం..

**కడప కార్పొరేషన్, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

తమ కుటుంబ సభ్యుల ఉజ్వల భవిష్యత్తుకోసం షేక్ మహబూబ్ జాన్ 6 నెలల క్రితం కువైట్ ఇంట్లో హౌస్‌పెయిడ్ పని నిమిత్తం కువైట్ వెళ్లింది. అక్కడ విశ్రాంతి లేని పనుల కారణంగా ఆమె అనారోగ్యంబారిన పడ్డారన్నారు. ఆమె స్పాన్సర్ (కువైటీ) రూంలో బంధించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌లో ఆమె తెలిపారు. వారు విషయాన్ని మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాషా దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే నవాజ్ ఏపీఎన్‌ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ ద్వారా ఏపీఎన్‌ఆర్టీఎస్ ఛైర్మన్ మేడపాటి వెంకట్ దృష్టికి తీసుకెళ్లారు. మేడపాటి వెంకట్ కువైట్ ఇండియన్ ఎంబసీ అధికారులకు మెయిల్ ద్వారా సమాచారం అందించి వైకాపా కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డికి విషయాన్ని వివరించి మహబూబ్ జాన్‌ను ఇండియా పంపే ఏర్పాటు చేయాలని కోరారు. కువైటీ ఇంటి నుంచి మహబూబ్ జాన్‌ను విడిపించిన బాలిరెడ్డి ఎంబసీలో ఆశ్రయం కల్పించారు. ఆమెకు స్పాన్సర్లు పాస్‌పోర్టు ఇవ్వకపోవడంతో అవుట్ పాస్‌పోర్టు తయారు చేయించారు. ఇండియా వచ్చేందుకు మహబూబ్ జాన్‌కు రూ.9వేలు బాలిరెడ్డి వితరణ చేశారు. కువైట్ నుంచి మహబూబ్ జాన్ ఇండిగో విమానంలో ఇండియాకు చేరుకున్నారు. ఏపీ ఎన్‌ఆర్టీఎస్ సేవలను ఎమ్మెల్యే నవాజ్ ప్రశంసించారు. కువైట్ నుంచి ఇండియాకు మహబూబ్‌నగర్‌లో సురక్షితంగా చేర్చినందుకు మేడపాటి వెంకట, ఇలియాస్, బాలిరెడ్డి, ఎంబసీ అధికారులు అభినందించారు.

## ప్రొద్దుటూరుకు చేరిన సిపిఐ బస్సు యాత్ర

**ప్రొద్దుటూరు అర్బన్ ఆగస్టు 31, ప్రభాతవార్త**



రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర గురువారం ప్రొద్దుటూరుకు చేరుకుంది. సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య, దుర్గ భవాని, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కార్యవర్గ సభ్యులు రామయ్య, బషీరున్నిసా, విజయలక్ష్మి, నాగ సుబ్బా రెడ్డి, వెంకట శివ, పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు,ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్,సురేష్, ఏఐటీయూసీ నాయకులు మచ్చా శ్రీను,మాబు,గురుస్వామి, సుధాకర్, ఇన్సఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్థానిక పుట్టపర్తి సర్కిల్లో సమావేశం ఏర్పాటు చేశారు. సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం పోలీసు రాజ్యాం నడుస్తుందని కాబట్టి ప్రజలు రాష్ట్రాన్ని రక్షించు కోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఉపాధ్యాయ సంఘాలపై కేసులు ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టి బెదిరిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. రాష్ట్రాన్ని రక్షించాలంటే జగన్మోహన్ రెడ్డిని ఇడుపుల పాయకు పంపాల్సిందేనన్నారు. ఇక కేంద్రంలో 9 ఏళ్ల బిజెపి పాలనలో మోదీ కులాల మధ్య మంట పెడుతున్నారని, భారతదేశ హిందూ దేశం కాబట్టి అందరూ తనకు ఓట్లు వేయాలంటున్నాడని, మణిపూర్‌లో మంట పెట్టాడన్నారు. అనంతరం స్థానిక సుందరయ్యకాలనీలో పర్యటించారు.

## పుట్టపర్తి నారాయణాచార్యుల గృహాన్ని స్మారక మందిరంగా ఏర్పాటు చేయాలి

### గానుగపెంట హనుమంతరావు విజ్ఞప్తి

**కడప ఆగస్టు 31, ప్రభాతవార్త**



సరస్వతీపుత్ర, 14 భాషలలో పండితుడు పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణచార్యుల నివాస గృహాన్ని ప్రభుత్వము స్మారక మందిరంగా గుర్తించి ఏర్పాటు చేయాలని, అంతే కాక ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన నివసించిన వీధికి కడపలో పుట్టపర్తి నారాయణాచార్యుల వీధిగా నామకరణం చేయాలని, మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, భారత రాష్ట్రపతి వార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం పుట్టపర్తి నారాయణ చార్యుల నివాసం వద్ద ఒక గంట సేపు సభ్యులతో కలిసి మౌనం పాటించారు. అంతేకాక ఆయన 34 వర్ధంతి శుక్రవారం నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పుట్టపర్తి నారాయణ చార్యులు కడపలోని రామకృష్ణ హై స్కూల్లో తెలుగు పండితునిగా ఉద్యోగించి అదే వీధిలో మరణించేంత వరకు నివసించారన్నారు. ఈ కార్యక్రమంలో మొల్ల సాహితీ పీఠం సభ్యులు న్యాయవాది రామ్మోహన్, ఇంజనీర్ రఘుబాబు, కరిముల్లా రాయల్, శివ హేమంతా చారి తదితరులు పాల్గొని పుట్టపర్తికి నివాళులర్పించారు.

## నైపుణ్యంతో ఆత్మ విశ్వాసం

### ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్

**వైవీయూ ఆగస్టు 31, ప్రభాతవార్త**



కంప్యూటర్ నైపుణ్యత మీలో ఆత్మవిశ్వాసాన్ని పరిపాలనలో వేగాన్ని పెంచుతుందని యోగివేమన విద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. వైవియూలోని బోధనేతర సిబ్బందికి కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీలో "కంప్యూటర్ ప్రొఫిషియన్సీ స్కిల్ " పై నెల రోజుల శిక్షణ ముగింపు సందర్భం గా సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ఉపకులపతిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొట్ట మొదటగా బోధనేతర ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం మీలో నైపుణ్యా లను పెంపొందించేందుకు, నేటి పోటీ ప్రపంచానికి తగినట్లుగా తయారు చేస్తానని చెప్పానన్నారు. ఇవాళ మీ స్పందనను వింటుంటే మీరు కంప్యూటర్‌పై పూర్తి అవగాహన పెంపొందించుకున్నారని అర్థమవుతోం దన్నారు. మీలో కంప్యూటర్ జ్ఞానాన్ని పెంచిన కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని అభినందిస్తున్నా మన్నారు. అనంతరం ఉప కులపతి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు.

## శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నోవా ఫెస్ట్ 23

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 31, ప్రభాతవార్త**



స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమం నందు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యందు బిబిఏ డిపార్ట్మెంట్ విద్యార్థుల ఆధ్వర్యంలో నోవా ఫెస్ట్ 2023 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అరకట వేముల హరినారాయణ మాట్లాడుతూ కళాశాలలో చేరిన విద్యార్థులకు విద్యుతో పాటు వారి ఉద్యోగ భవిష్యత్తుకు సంబంధించిన ఆలోచనలను, ఆచరణలను కళాశాలలో అనుభవ పూర్వకమైన అధ్యాపకుల ద్వారా నిర్వహి స్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూడు విభాగాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని ఇందులో బ్రిలియంట్ బ్రెయిన్, ప్రెసెంట్ఆం, క్విజ్ కాంపిటీషన్లు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .బిబిఏ డిపార్ట్మెంట్ హెచ్ఓడి అజ్రా అజ్మత్ కార్యక్రమ అనంతరం పోటీలలో విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు మెడల్స్ కళాశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపల్ చే అందజేశారు. బ్రిలియంట్ బ్రెయిన్ నందు సయ్యద్ నిస్సార్ సుష్మ ప్రియాంక మొదటి రెండు స్థానాలు గెలుచుకున్నారు ప్రెజెంటఅం నందు అనుష్క, నీలవతి మొదటి స్థానం అస్లాం రెండవ స్థానం నందు విజయం సాధించారు. క్విజ్ కాంపిటీషన్ నందు శివ గణేష్ మహేష్‌లు ప్రథమ స్థానంలో నిలువగా గురప్ప మహబూబాబాద్ మంజునాథ రెండవ స్థానం పొందారు. కార్యక్రమంలో కోఆర్డినటర్ గౌరి శంకర్ ,కళాశాల ప్రిన్సిపల్ ముస్తఫా, శారద భవాని మరియు కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## శివశివానీ స్కూల్లో రాఖీ బంధన్



**కడప కార్పొరేషన్, ఆగస్టు 31, ప్రభాతవార్త:**

శివ శివానీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో రాఖీ బంధన్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి గీతాలు ఆలపించారు. విద్యార్థులు రాఖీ పౌర్ణమి పండగ దృష్ట్యా ప్రదర్శన కూడా చేశారు. ఉపాధ్యాయులకు మహిళా ఉపాధ్యాయురాళ్లు రాఖీలు కట్టారు. తమ సోదరులకు సోదరీమణులైన విద్యార్థులు రాఖీ కట్టారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా గురువారం కడప శివ శివానీ హైస్కూల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులందరికీ రాఖీలు కట్టారు. ఒకరికి ఒకరు సోదర భావంతో మెలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శివశివాని హైస్కూలు కరస్పాండెంట్ రమణి, డైరెక్టర్ నాగేంద్రా రెడ్డి, ప్రిన్సిపల్ శివప్రసాద్, హెడ్మాస్టర్ శివప్రకాష్, పీఈటీ అనిల్, ఉపాధ్యాయులు సుష్మిత, మహాలక్ష్మీ సురేష్, జాకీర్, నారాయణస్వామి, మల్లికా, నరసింహ, కల్యాణ్, రేఖ, కీప, లక్ష్మీ ప్రసన్న, జ్వాలిత, లావణ్య, వబల, పద్మ, ఆశాలత, లక్ష్మీదేవి, ఉషారాణి, స్వయం సేవకులు మురళీమోహన్‌రెడ్డి, శ్రీరామ్ కుమార్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన ఇండియా

**రామాపురం ఆగస్టు 31, ప్రభాతవార్త**



చంద్రయాన్ 3 విజయవంతంతో శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలచిందని మండల విద్యాశాఖ అధికారి రామ కృష్ణుడు అన్నారు మండలంలోని నీలకంఠారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం చంద్రయాన్ 3 విజయవంతం పై విద్యార్థులలో దేశభక్తి పెంపొందించడానికి భారత శాస్త్రవేత్తలు కృషిని అభినందిస్తూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఎం-ఈఓ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలో ఏ దేశము చేయని విధంగా శాస్త్ర సాంకేతిక రంగంలో దూసుకుపోతుందని చంద్రునిపైన దక్షిణ ధ్రువం పై ఇంతవరకు ప్రపంచంలో ఏ దేశం చేయని ప్రయోగాన్ని మన దేశం చేసి చూపిందని అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగు ఉర్దూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, హిలాల్ అహ్మద్, తెలుగు మీడియం పాఠశాల పిడి నరేంద్ర కుమార్ రెడ్డి కాంప్లెక్స్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## సానిపాయిలో ఓటర్ వెరిఫికేషన్‌లో పాల్గొన్న ఆర్‌డిఓ

**వీరబల్లి ఆగస్టు 31, ప్రభాతవార్త**



మండలం లోని సానిపాయి గ్రామంలో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం లో గురువారం ఆర్డిఓ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని విదిగా చేపట్టారు. అందులో భాగంగా ఆర్డిఓ సానిపాయి గ్రామం కొత్తపేటలో పాల్గొని ఓటర్ వెరిఫికేషన్ ఎలా జరుగుతుందో ఆయన అక్కడున్న టిడిపి బూత్ కన్వీనర్ మాజీ సర్పంచ్ నేతి వెంకటరమణను , బిఎల్ఓ జాఫర్ లను అడిగి తెలుసుకున్నారు. అలాగే మర ణించిన వారి పేర్లు తొలగింపు పై వాస్తవమో కాదో గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు ఎటువంటి పొరపాటు జరగకుండా ఓటర్ వెరిఫికేషన్ జరగాలని ఆయన అక్కడున్న బిఎల్ఓ లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అనిపినేని నాగేశ్వర నాయిడు తదితరులు పాల్గొన్నారు.

## నేడు శిల్పారామానికి శంకుస్థాపన

**రామాపురం ఆగస్టు 31, ప్రభాతవార్త**



మండలంలోని బండపల్లి పంచాయతీ సమీపంలోని జాతీయ రహదారి సమీపంలో ఐరిస్ హోటల్ ఎదురుగా శుక్రవారం జిల్లా కలెక్టర్ గిరీశా, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి లు శిల్పారామం కి శంకుస్థాపన చేయనున్నట్లు కేపిఆర్ కనెక్షన్ యాజమాన్యం పెంచల్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమానికి ప్రజాప్రతి నిధులు అధికారులు హాజరుకావాలని ఆయన తెలిపారు

## దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు జాగ్రత్త వహించాలి

### ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య

**ఖాజీపేట ఆగస్టు 31, ప్రభాతవార్త**



ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కొత్తపేట సచివాలయం లో డాక్టర్ వైఎస్ ఆర్ హెల్త్ క్లినిక్‌ను మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం తనిఖీ చేశారు. గురువారం కొత్తపేట సచివాలయం పరిధిలో డాక్టర్ వైఎస్ ఆర్ హెల్త్ క్లినిక్ ను తనిఖీ చేసిన వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు గ్రామంలో ఏ ఒక్కరికి ఏ రకమైన అనారోగ్యం ఉన్న కూడ వెంటనే వారికి చికిత్సలు అందించాలన్నారు. గ్రామంలో ఎక్కడ కూడ అపరిశుభ్రత ఉండ కూడదని, ఆ దిశగా ప్రజలను చైతన్యం కలిగించాలని, గ్రామంలోని ప్రజలకు హెల్త్ క్లినిక్ ఉందని అందరికి తెలియజేప్పాలని వారు వైద్య సిబ్బందికి తెలిపారు. జాతీయ కార్యక్రమాలు అయిన మలేరియా, డెంగ్యూ, క్షయ, కుష్ఠు వ్యాధులపై అప్ర మతంగా ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి. నాగభూషణం, సూపర్ వైజర్ శోభన్ బాబు, సిహెచ్ఓ శిరీష,ఏయన్ యం మెహరున్నిషా, ఆశా కార్యకర్త కాశీరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే చర్యలు : సిఐ

**వీరబల్లి ఆగస్టు 31, ప్రభాతవార్త**



మండలంలోని ఎవరైనా ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ తులసిరాం తెలిపారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గతంలో ఎర్ర చందనం అక్రమ కేసులలోని ముద్దులను, సస్పెక్ట్‌లను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని ఎవరైనా ఎర్ర చందనం అక్రమ రవాణా పాల్పడినట్లయితే తమ దృష్టికి తేవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రమోహన్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిపి ఆధ్వర్యంలో ఐ క్యాంపునకు తరలిన ప్రజలు

**వీరబల్లి ఆగస్టు 31, ప్రభాతవార్త**



రాజంపేట ఆకెపాడు ఎస్టేట్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ ఆకే పార్టీ అమర్నాథ్ రెడ్డి నిర్వహిస్తున్న ఉచిత ఐ క్యాంపుకు మండల నుండి ఎంపీపీ ఆధ్వర్యంలో సుమారు 70 మంది. ఉచిత కంటి పరీక్షల కోసం తరలి వెళ్లారు. ఈ కార్యక్రమానికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన విఆర్ సంస్థల అధినేత విఆర్ వెంకట్రామిరెడ్డికి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మల్లేశ్వరి, వైసీపీ నాయకులు తారకేశ్వర్ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోపూరు రెడ్డయ్య నాయుడు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఇఓ

**గాలివీడు ఆగస్టు 31, ప్రభాతవార్త**



మండల కేంద్రం లోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి పిల్లి నాగరాజు మధ్యాహ్నం భోజనాన్ని ఆక స్మిక తనిఖీ చేశారు. గురువారం ఆయన పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.తానే స్వయంగా విద్యార్థులకు వడ్డించారు. భోజన నాణ్యత పై అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఖచ్చితంగా అమలు చేయాలని భోజనం నిర్వాహకులను ఆదేశించారు. నిర్లక్ష్యం చూపకుండా పర్యవేక్షించాలని స్థానిక హెచ్ఎం ను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

## పట్టణంలో నీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కౌన్సిల్‌మీట్‌లో ఛైర్‌పర్సన్ మనూజా



మదనపల్లె, ఆగస్టు 31 ప్రభాతవార్త :

పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజా తెలిపారు. గురువారం ఛైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి ఎద్దడి ఉన్న వార్డులను గుర్తించి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పట్టణ శివారు ప్రాంతాల్లో ప్రజల దాహార్తి నివారణకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. అదే విధంగా వర్షాకాలంలో సీజనబుల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి మాట్లాడుతూ పట్టణంలోని వాగులు, వంకలు శుభ్రం చేసి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా రోజూ ఫాగింగ్, శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ బేబివెల్‌కం చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో వీధిదీపాల మరమ్మత్తులకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కుక్కల బెడద నివారణకు శాశ్విత చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ ట్యాగ్ బిగించని వీధి కుక్కలను పట్టి వేరివేయాలన్నారు. మరో ఛైర్‌పర్సన్ నూర్‌అజాం, కౌన్సిలర్ ఖాజాలు మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. అర్హులందరికి పెన్షన్లు ఇవ్వాలని కౌన్సిలర్ రాజేష్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ నాగేశ్వర్‌రావు, ఏఈ స్నేహప్రియ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అర్ధనగ్న ప్రదర్శనతో దస్తావేఖరులు నిరసనలు



మదనపల్లె, ఆగస్టు 31 ప్రభాతవార్త :

దస్తావేఖర్ల పొట్టలు కొట్టే నూతన విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ రెండవ రోజు గురువారం సబ్‌రిజిష్టర్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శనతో నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంగేరి నందా మాట్లాడుతూ మదనపల్లె సబ్‌రిజిష్టర్ కార్యాలయం ఎదుట దస్తావేఖరులు రెండు రోజులుగా పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే అర్ధనగ్నాలతో ప్రభుత్వానికి నిరసనలు వ్యక్తం చేశామన్నారు. ప్రభుత్వం ఇటీవల రిజిస్ట్రేషన్ల శాఖలో తీసుకువచ్చిన ప్రైమ్ 2.0 విదానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రైమ్ నూతన విదానం వల్ల కక్షదారులే స్వయంగా వెళ్ళి రిజిస్ట్రేషన్‌లు చేసుకునే పద్ధతి వలన రాష్ట్రంలో వేలాది మంది దస్తావేఖరులు, స్టాంపు రైటర్లు, డిటిపి ఆపరేటర్లు ఉపాధి అవకాశాలు కోల్పోతారన్నారు. ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకొని రిజిస్ట్రేషన్ శాఖలో తీసుకువచ్చిన నూతన విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో దస్తావేఖర్ల సంఘం మదనపల్లె అధ్యక్షులు రఘు, గుణశేఖర్, రంగు రాజేంద్ర, బాబు,నూర్‌మహమ్మద్, శివకుమారి, తాహీర్, వెంకటేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బలిజల కళ్యాణ మండపంకు స్థలం మంజూరు

సేవాసంఘం అధ్యక్షులు బిపిఎల్ విజయకుమార్



మదనపల్లె, ఆగస్టు 31 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలో బలిజల కళ్యాణ మండపం నిర్మాణానికి గానూ ప్రభుత్వం 1.83ఎకరాల స్థలాన్ని మంజూరు చేసినట్లు బలిజ సేవాసమితి అధ్యక్షులు బిపిఎల్.విజయకుమార్ తెలిపారు. గురువారం బలిజ సేవాసమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలిజ కుల స్థలను గత పాలకులు పట్టించుకోకపోయినా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి బలిజల కళ్యాణ మండపం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాల కృషి వల్లే బలిజలకు న్యాయం జరిగిందన్నారు. పట్టణ నడిబొడ్డున క్రిష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుకు వీరే సహకరించారన్నారు. బలిజలు కోరిన వెంటనే కళ్యాణ మండపానికి బసినికొండ గ్రామం సర్వేనెంబర్ 174/3 లో స్థలం కేటాయించడం పట్ల వీరికి బలిజలు రుణపడి ఉంటారన్నారు. త్వరలోనే కళ్యాణ మండపం పనులను శ్రీకారం చుడుతామన్నారు. అనంతరం బలిజ సంఘం నాయకులు, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, స్టోర్ మోహన్, విజయలక్ష్మి భాస్కర్, మదనేశ్వర్, రాజభవన్‌రాజా, పగడాల సూరి, జంగాల శివరామ్, ఆర్‌ఆర్ జ్యువలరీస్ రామాంజునేయులు, బోరువెల్ సుధాకర్, భానుప్రకాష్, పూలనాగరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన కౌన్సిలర్లు



మదనపల్లె, ఆగస్టు 31 ప్రభాతవార్త :

రాఖీ పౌర్ణమి సందర్భంగా గురువారం ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు కౌన్సిలర్లు సుగుణ, రేణుక, కోఆప్షన్ సభ్యురాలు శారదారెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ అపర్ణలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు స్వీట్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సోదరభావాన్ని పెంపొందించేందుకే రాఖీ పౌర్ణమి జరుపుకోవడం జరుగుతుందన్నారు. మహిళలు సోదరులుగా ఉన్న వారికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలపడం జరుగుతుందన్నారు. అదే విధంగా కౌన్సిల్‌హాలులో కూడా ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్లుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు

రామసముద్రం, ఆగస్టు 31 ప్రభాతవార్త :



మండలంలోని గుంతలపేట గ్రామంలో వెలసిఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు, విశేషాలంకరణలు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రి కీచకుని వద నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నారాయణ, మునిరాజా, సుబ్రమణ్యం, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠినచర్యలు

సిఐ మహబూబ్‌బాషా



మదనపల్లెక్రైం, ఆగస్టు 31 ప్రభాతవార్త :

పట్టణంశివారుల్లో ఒపన్‌డ్రింకింగ్ చేసే వారిపై చర్యలు తప్పవని రెండవ పట్టణ ఇన్‌చార్జ్ సిఐ మహబూబ్‌బాషా హెచ్చరించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాత్రివేళల్లో ఎవరైన మద్యం సేవించి నేరాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అత్యవసరమైతే తప్ప రాత్రి 10.30 గంటలపైన రోడ్లపై తిరగవద్దన్నారు. అలా రోడ్డుపై ఎవరైన కనిపిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. బాధ్యతారహితంగా తిరిగేవారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. రాత్రి గస్తీనీ ముమ్మరం చేస్తామన్నారు. దీనిపై సిబ్బందికి సూచనలు ఇవ్వటం జరిగిందన్నారు.

## ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

ఎస్‌ఐ చంద్రశేఖర్

రామసముద్రం, ఆగస్టు 31 ప్రభాతవార్త :



ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ చంద్రశేఖర్ సూచించారు. గురువారం ఆటోడ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల రికార్డులు కలిగి ఉండాలని, ఎక్కడ బడితే అక్కడ ఆటోలను నిలపరాదని హెచ్చరించారు. ప్రయాణీకుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అ సందర్భంగా ఆటో డ్రైవర్లుకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఘనంగా రామసముద్రంలో రాఖీ పండగ

రామసముద్రం, ఆగస్టు 31 ప్రభాతవార్త :

రామసముద్రం మండలంలో ఘనంగా రాఖీ పండగను జరుపుకొన్నారు. గురువారం అన్నదమ్ములకు మహిళలు రాఖీకట్టి స్వీట్లు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ రాఖీ పండగ సోదరబావానికి ప్రతీకంగా నిలుస్తుందన్నారు.

## వెబ్ డెవలెప్‌మెంటుపై అవగాహన పెంచుకోవాలి

కురబలకోట, ఆగస్టు 31 ప్రభాతవార్త :



ఇంజనీరింగ్ విద్యార్థులు వెబ్‌డెవలెప్‌మెంటుపై అవగాహన పెంచుకోవాలని బెంగుళూరుకు ఒరాకిల్ ప్రెంట్ అండ్ డెవలపర్ కంపెనీకి చెందిన పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో వెబ్ డెవలప్‌మెంటుపై విద్యార్థులకుఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెబ్‌సైట్ డిజైన్‌లలో లైట్లు అవసరాల విశ్లేషణ, వినియోగం, క్యాన్సట్ క్రియేషన్, లేవుట్ డిజైనింగ్ మొదులగునవివెబ్ బ్రోవ్‌సేర్ ద్వారా ఓపెన్ చేయబడుతాయని తెలిపారు. ఈ వెబ్ డిజైనింగ్‌కు ముఖ్యంగా హెచ్‌టిఎల్‌ఎల్, సిఎస్‌ఎంకి ఫోటోశాప్ డిజైన్స్ సంబాషణ, పంక్షనాలిటి ఎంతో ముఖ్యమని వాటిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాదిపతి డాక్టర్ కల్పన, కోఆర్డినేటర్స్ షాయిజ్, డాక్టర్ కిరణ్‌లు, పాల్గొన్నారు.

## హెచ్‌ఎంలు లీడర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కురబలకోట, ఆగస్టు 31 ప్రభాతవార్త :

అప్రర్‌ప్రైమరీ, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు నాయకత్వ లక్షణాలను సద్వినియోగం చేసుకొని పిల్లల విద్యాభివృద్ధికి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సమగ్ర శిక్షణ ఐఎంఎస్ ప్లానింగ్ ఆఫీసర్ సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని అంగళ్ళు వద్ద ఉన్న జీవిఐసి ఇంజనీరింగ్ కళాశాలలో హెచ్‌ఎంలకు నాయకత్వ లక్షణాలపై శిక్షణా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు సహకారంతో సాల్ట్ విజనరీ ప్రాజెక్టు ద్వారా హెచ్‌ఎంలకు ఈ శిక్షణా కార్యక్రమాలను మూడు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు నిర్వహించడం జరుగుతోందన్నారు. హెచ్‌ఎంలు నాలుగు రంగాల్లో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ సెక్టోరియల్ అధికారులు డివైఈఓ క్రిష్ణప్ప, ఎంఈఓలు ద్వారకనాథ్, శ్రీనివాసలు, ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ పాల్గొన్నారు.

## గ్రామ పాలనలో కార్యదర్శులే కీలకం

కురబలకోట, ఆగస్టు 31 ప్రభాతవార్త :



గ్రామ పంచాయితీ పాలనలో కార్యదర్శులే కీలకమని రిటైర్డు ఐఏఎస్ అధికారి మురళీ అన్నారు. గురువారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రామ పంచాయితీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామ పంచాయితీ పరిధిల్లో లేవుట్ల భవన నిర్మాణాల నియమాలను జీవనశైలి పెంపుదించుటలో 156యాక్టివిటీస్ స్వామిత్వ తదితర అంశాలపై ఆయన ప్రసంగించారు. గ్రామ పంచాయితీ ద్వారా సుపరిపాలన, గ్రామసభ, సమావేశాలు నిర్వహణ పంచాయితీ విదులు, బాధ్యతలు తదితర అంశాలపై పూర్తిగా అమలు చేయాల్సిన బాధ్యత కార్యదర్శులదే అన్నారు. పాలనాపరమైన సమస్యలపై ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. జిల్లా పంచాయితీ ఆఫీసర్ ధనలక్ష్మి, డిఎల్‌పిఓ నాగరాజు, ఈఓఆర్‌డి అబ్దుల్‌షకూర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## యువగళం 200రోజులు పూర్తి

కురబలకోట, ఆగస్టు 31 ప్రభాతవార్త :



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌బాబు నిర్వహించిన యువగళం పాదయాత్ర 200రోజులు పూర్తి చేసుకొన్న సందర్భంగా గురువారం అంగళ్ళులోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో 200వ రోజు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ రుద్రాబాలక్రిష్ణ, అయూబ్‌బాషా, మోహన్‌రెడ్డి, నరసింహులు, కేసీ.రామచంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు పరిష్కరించడానికే పల్లెబాట



పెద్దమండ్యం ఆగస్టు 31 ప్రభాతవార్త

గురువారం పెద్దమండ్యం మండలం సిగొల్లపల్లె పంచాయితీలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఆదేశాలమేరకూ పల్లెబాటకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి పూర్ణ చంద్రికరమేష్,జడ్పీటీసి పీరమ్మ,సర్పంచ్ కంటివిశ్వనాథరెడ్డి ఆద్వర్యంలో ప్రతి ఇంటికితిరుగుతూ సమస్యలను అడిగితెలుసుకున్నారు.సంక్షేమపథకాలు వచ్చిన వి,రావల్సినవి ఏమైనాఉన్నాయిఅని అడిగారు.రానివాటిపై స్పందించి అక్కడే ఉన్నఅధికారులతో సమస్యలను పరిష్కరించారు.ఈకార్యక్రమంలో ఎంపిడివో శ్రీధర్,ట్రాన స్కోఏఈ శంకర్‌రెడ్డి,ఏపివోమురళి,ఎపిఎంసూరి, జెసీఎస్ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి,మండలకన్వీనర్ చాన్‌బాషా,సర్పంచులుకేశవ,విశ్వనాథ, బయ్యారెడ్డి వెలిగల్లు రెడ్డెప్పరెడ్డి,చానూ.ఎంఈవోమనోహార్,మండలస్థాయి అధికారులు,వాలంటీర్లు,సచివాలయసిబ్బంది,వీఆర్వో జయరాం, కోసూరిరామక్రిష్ణ,రెడ్డీఖాన్, వైసీపినాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పీలేరు,ఆగస్టు 31 ప్రభాతవార్తః



అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం పీలేరు పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై నరసింహులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన సుధాకర్(37) తన కుమార్తె నందిని కోటపల్లె బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈమెను పాఠశాలలో వదిలేందుకు గురువారం ఉదయం ఆటోలో సుధాకర్ వచ్చాడు. ఆక్కడ ఆటో దిగిన కుమార్తె తరగతి గదిలోకి వెళ్లింది. ఈక్రమంలో పాఠశాల బయట ఇద్దరు గుర్తు తెలియనివ్యక్తులు ఆటో దగ్గరకు వచ్చారు. తమని ఆర్టీసీ బస్టాండు వరకు వదిలిపెట్టు అని సుదాకర్‌ను అడుగుతూ ఒక వ్యక్తి ఆటోలో ఎక్కాడు ఇంతలో వెనుక నుంచి ఏదో సూదితో గుచ్చినట్లు అనిపించడంతో వెనుక తిరిగి చూశాడు. అప్పటికే ఆటోలో ఉన్న వ్యక్తి పారిపోయాడు. కొంత సేపటికి సుధాకర్ సంఘటనా స్థలంలోనే కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురావడంతో అప్పటికే మతిచెందినట్లు వైద్యులు గర్తించారు. మతుడి వీపుపైన సూదితో గుచ్చిన గుర్తులను పోలీసులు గుర్తించారు. మతుడికి భార్య అశ్విని, కుమార్తెతో పాటు కుమారుడు కేతన్‌లు ఉన్నారు.

## అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించడమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పీలేరు, ఆగస్టు 31 ప్రభాతవార్తః

అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని పీలేరు ఎమ్మెల్యే అన్నారు. గురువారం మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి గడిచిన నాలుగున్నర సంవత్సర కాలంలో వివిధ అభివద్ధి సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందించారు. అభివద్ధిని చూసి మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ని ఆశీర్వదించి సీఎం చేయాలని కోరారు. రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. అనంతరం సీఎం చిత్రపటాని పాలాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి ,ఎంపీ చైర్మన్ యల్లయ్య, వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి , సర్పంచిలు హరని,హబీబ్‌బాషా, జగన్‌మోహన్‌రెడ్డి,ఎంపీ పీఏ ఉదయ్, ఏఎంసీ డైరెక్టర్ కాలనీ చిన్న, మాజీ సర్పంచి హుమయూన్ ఎంపీటీసీ బిందు, నాయకులు సురేష్‌కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రోగ్రెస్‌కార్డులు పంపిణీ

సంబేపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం విద్యార్థులకు కార్పొరేట్ హంగులతో కూడిన ప్రోగ్రెస్ కార్డులను ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షలలో విద్యార్థుల ప్రగతి ఎలా ఉందో ప్రోగ్రెస్ కార్డులలో నమోదు చేశామన్నారు. అంతేకాక తరగతి గదిలో విద్యార్థి ప్రతిభ, మార్కులు ఎలా వస్తున్నాయో ఇంటి దగ్గర ఉన్న తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ఈ ప్రోగ్రెస్ కార్డులలో సంబంధిత విద్యార్థి పాఠశాలకు ఏ ఏ నెలలో ఎన్ని రోజులు హాజరైనది కూడా నమోదు చేస్తున్నామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రోగ్రెస్ కార్డులను రూపొందించి విద్యార్థులకు అందజేయడం సంతోషకరంగా ఉందన్నారు. తల్లిదండ్రులు వాటిని పరిశీలించి, సంతకం చేసి తిరిగి పాఠశాలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూతులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



కలికిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త:

మండలంలోని గుట్టపాలెం పంచాయతీలోని 208 పోలింగ్ బూతును అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ తనిఖీ చేశారు. పోలింగ్ పరిధిలో ఓటరు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ఓటరు నమోదుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా ఓటు నమోదు చేయాలని రెవెన్యూ సిబ్బందిని జేసీ ఆదేశించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు భాగ్యలత, వీఆర్వో కదిరప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

## యువగళంపాదయాత్ర 200రోజులు సంబరాల్లో టిడిపి

పెద్దమండ్యం ఆగస్టు 31 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ నారాలోకేష్ యువగళంపాదయాత్ర నేటితో200 రోజులుపూర్తి చేసుకున్న సుభసందర్భంగా తెలుగుదేశం మండల మాజీఅధ్యక్ష్యుడు శిద్ధవరం నానబాలప్రసాద్ టిడిపిశ్రేణులు సంబరాలు జరుపుకుని మండలంలో శిద్ధవరం లోపాదయాత్ర నిర్వహించారు.రెండువందలరోజుల్లో 77నియోజకవర్గాలు చుట్టి ప్రజలసమస్యలు తెలుసుకుని అధికారంలోకిరాగానే పరిష్కారానికి హామీలుఇచ్చి ననారాలోకేష్‌కు ప్రజలు అభిమానులు బ్రహ్మరథంపడుతున్నారు. దిగ్విజయంగా మిగిలినియోజకవర్గాలలో పాదయాత్ర సంతోషంగా ఎలాంటి ఆటంకాలు కలగకుండా సాఫీగాసాగాలని దేవుడిని ప్రార్థించారు. మళ్ళీరామరాజ్యం వస్తుందని ఎలాంటిసమస్యలు లేకుండాప్రజలు సంతోషంగా సుఖంగా ఉండవచ్చన్నారు.

## చలో విజయవాడకు వెళుతున్న ఎస్‌టియు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాజంపేట అర్బన్, ఆగస్టు 31 ప్రభాతవార్త

సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు విజయవాడలో జరిగే ఆందోళన కార్యక్రమానికి వెళుతున్న ఉపాధ్యాయ సంఘం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న సమాచారంతో బాలికల హైస్కూల్ కాంప్లెక్సు సమావేశంలో ఉన్న ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై.సుబ్రమణ్యంరాజు, జిల్లా నాయకులు పి.సుబ్రమణ్యం లను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిపిఎస్ హామీపై మోసం చేశారని పేర్కొన్నారు. ఆందోళనకు వెళుతున్నవారిని అదుపులోకి తీసుకోవడం శోచణీయమన్నారు. ఇంతలోపే చలో విజయవాడ కార్యక్రమం వాయిదా పడిన విషయం తెలియడంతో అదుపులోకి తీసుకున్న నాయకులను పోలీసులు విడుదల

## పవన్‌కళ్యాణ్ పుట్టినరోజున రాజంపేటలో మహా రక్తదాన శిబిరం

జనసేన నేత శ్రీనివాసరాజు

రాజంపేట అర్బన్, ఆగస్టు 31 ప్రభాతవార్త



సెప్టెంబరు 2న జనసేనాని పుట్టిన రోజు సందర్భంగా మన్నూరులోని పార్టీ కార్యాలయంలో మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాజంపేట నియోజకవర్గ నేత యల్లటూరు శ్రీనివాసరాజు వెల్లడించారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటల నుండి రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని జనసైనికులు, పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ హాజరై రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలను ఆకర్షితునై పార్టీలో చేరానన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న పవన్‌ను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టత కోసం పార్టీ నాయకులను, జన సైనికులను, మెగా అభిమానులను కలుపుకుని సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నందలూరు మాజీ జడ్‌పిటిసి శివరామరాజు, పివిఆర్ కుమార్, నాసిర్‌ఖాన్, సింగంశెట్టి సూరి, పత్తి వెంకటసుబ్బయ్య, పలుకూరి రవిశంకర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన తాండాలలో పల్లెబాటకు బ్రహ్మరథం



తంబళ్లపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం ఆర్‌ఎస్.తాండా కొటాల పంచాయతీలలో గురువారం జరిగిన పల్లెబాట కార్యక్రమానికి స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సర్పంచులు చెన్నకేశవరెడ్డి, సహదేవరెడ్డి ఆద్వర్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు గడప గడపను జల్లె పట్టి సమస్యల కోసం ఎదురుచూశారు. ఎక్కడికి వెళ్లినా తమకు ఎలాంటి సమస్యలు లేవని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు సకాలంలో స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో అధికారులు అందిస్తున్నట్లు చెప్పారు. కొట్టాల ఏటిగడ్డన వర్షాకాలంలో ప్రాజెక్టు వరద నీటి ప్రవాహంతో సుమారు పాతిక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొట్టాల ఏటిగడ్డన, పెద్దేరు ప్రాజెక్టు మొరవ వద్ద వంతెనల నిర్మాణం పూర్తి చేస్తే మాకు సౌకర్యంగా ఉంటుందని కోరారు. ఈ సమస్యను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుదాకర్‌రెడ్డి, మండల వైకాపా అధ్యక్షుడు రేపన చౌడేశ్వర, వైస్ ప్రెసిడెంట్‌లు కోటిరెడ్డి, కరీం, చెన్నక మల్లికార్జున, పద్మశాలీ సంఘం రాష్ట్ర డైరెక్టర్ సురేంద్రనాథ్, గంగిరెడ్డిపల్లి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో సురేంద్రనాత్, ఎంఈవో త్యాగరాజు, ఏఈలు అశోక్, హరినాథ్, సుజాత, ఏపీఎం గంగాదర్, ఏపీవో అంజనప్ప, కార్యదర్శి నరసింహులు, పాల్గొన్నారు.

## కురువపల్లిలో ఉచిత వైద్య శిబిరం



తంబళ్లపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ కురవపల్లిలో గురువారం కోసువారిపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మునికుమార్ ఆద్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహణతో పాటు పలు వ్యాధులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలంలో ప్రభలే మలేరియా, డెంగీ, డయేరియా, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, చిన్నపాటి అస్వస్తత సోకినా వెంటనే స్థానికంగా గల ఆరోగ్య వైద్య శిబిరంలో వైద్యం పొందాలని సూచించారు. వైద్య సిబ్బంది సైతం మారుమూల గ్రామాల్లో పర్యటిస్తూ పారిశుద్ధ్యం, రక్షిత తాగునీటిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీహెచ్‌వో వెంకటరమణ, ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలికిరిలో ఘనంగా రాఖీ పండగ

కలికిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త:

కలికిరిలో గురువారం ఘనంగా రాఖీ పండగను అక్కా తమ్ముళ్లు, అన్నా చెల్లెల్లు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఉదయమే అక్కలు తమ్ముళ్లకు, చెల్లెల్లు అన్నగారికి రాఖీ కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు. దీంతో మండలంలో ఘనంగా రాఖీ పండగ జరిగింది.

# పథకాల పట్ల ప్రజలు చిరునవ్వుల దరహాసం

### ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 31 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజల ముఖాల్లో చిరునవ్వుల దరహాసం కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లె సచివాలయం-1లోని హరిజనవాడ, అరుంధతివాడలోగడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా ప్రజలు చిరునవ్వుతో స్వాగతిస్తున్నారని, ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు ఎంతో చేరి వున్నాయని, ఇంటి ముంగిట్లోనే స్వాగతిస్తున్నారని ఆయన అన్నారు. మొదట గ్రామంలోని రాములవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్థులు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ కండువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు కనుపర్తి ఈశ్వరయ్య, ప్రహల్లాద, వెంకటేశ్వర్లునాయుడు, ప్రతాప్‌రెడ్డి, నాగులు, చంద్రరాజు, వాటర్‌ప్లాంట్ రాజా, సర్పంచ్‌లు హరిక్రిష్ణారెడ్డి, శ్రీరామ్ వినోద్, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, వైఎస్ అన్వర్‌బాషా, కరిముల్లా, కొప్పల శంకరయ్య పాల్గొన్నారు.

# రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



నందలూరు, ఆగస్టు 31 ప్రభాతవార్త

నందలూరు మండలంలో గల రైల్వేస్టేషన్‌లో గరువారం ఉదయం లోక్‌మాన్ తిలక్ ముంబై నుంచి మదురై వెళ్ల వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లో మహారాష్ట్రకు చెందిన మహేష్ మెటక్ అనే ప్రయాణికుడు కుటుంబంతో కలిసి షోలాపూర్ నుండి తిరుపతికి రిజర్వేషన్‌లో వెళ్లారు. అతను నందలూరు స్టేషన్‌లో కాలు జారి కింద పడడం జరిగింది. ఈ ప్రమాదంలో అతను రైలు, ప్లాట్‌ఫారం మధ్య నలిగి పెద్దగాయాలు అయ్యాయి. వెంటనే గమనించిన స్టేషన్ మాస్టర్, రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయభాస్కర్‌రావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి ప్రథమ చికిత్స అందించి 108కి కాల్ చేశారు. ఆ వాహనం రావడానికి ఆలస్యం కావడంతో ఆ వ్యక్తి మరణించినట్లు రైల్వే ఆర్‌పిఎఫ్ ఎస్ఐ రాజారామ తెలిపారు. భౌతికకాయాన్ని పంచనామా నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని జీఆర్‌పి ఎస్ఐ కె.ఎస్.వర్మ

# అంగన్వాడి కేంద్రాల్లో రాఖీ పౌర్ణమి



చిట్వేలి, ఆగస్టు 31 ప్రభాతవార్త

సోదరీ సోదరుల అనుబంధానికి ప్రతీకగా నిర్వహించే రాఖీ పౌర్ణమి వేడుకలను చిట్వేలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఘనంగా నిర్వహించినట్లు సిడిపిఒ రాజేశ్వరి తెలిపారు. చిట్వేలి, పెనగలూరు మండలాల్లో ఈ క్యాక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. చిట్వేలి పరిధిలోని నక్కలపల్లి ఐసిడిఎస్ కేంద్రంలో చిన్న పిల్లలకు రాఖీలు కట్టించి మిఠాయిలు పంచిపెట్టినట్లు ఆమె అన్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో అనుబంధాలు, పండుగల పట్ల ఆలోచనలు రూపొందించాలన్న ఉద్ధేశ్యంతో ప్రభుత్వం ఇట్టి కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తూ ఉందని ఆమె అన్నారు. పిల్లల తల్లిదండ్రులు, సిబ్బంది అక్షింతలు వేసి పిల్లలను దీవించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ వసుంధరమ్మ, అంగన్వాడి వర్కర్ విమల, హెల్పర్ వెంకటలక్ష్మి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# పోలీసులు మెరుగైన సేవలు అందించాలి

### ఆర్యవైశ్య వర్థక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు

బద్వేల్ అర్బన్, ఆగస్టు 31 ప్రభాతవార్త



బద్వేల్ పట్టణంలో మెరుగైన పోలీస్ సేవలు అందించాలని నూతనంగా అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన యుగంధర్ ను గురువారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే.వి సుబ్బారావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్ర శేఖర్, గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొలపర్తి హేమంత గుప్తా, జీవన్ కుమార్ తోపాటు శ్వేత అంబులెన్స్ యజమాని ఏవి సుబ్బయ్య యాదవ్, తిరువెంగళాపురం గ్రామ సర్పంచ్ నరసింహ యాదవ్ మరియు 24 వ వార్డు వైసిపి యువ నాయకులు సునీల్, మాస్ కమిటీ అధ్యక్షులు షేక్ అల్లా బాకాస్ సరిటాల మౌలాలి తో పాటు పలువురు మైనార్టీ నాయకులు శాలువా పూలమాలలతో సత్కరించి స్వీట్ బాక్స్ ను అందజేశారు, అనంతరం ఆర్యవైశ్య వర్ధక సంఘం అధ్యక్షులు కే.వీ సుబ్బారావు, మాస్ కమిటీ అధ్యక్షులు షేక్ అల్లా బకాష్‌లు మాట్లాడుతూ పట్టణంలో మెరుగైన పోలీసు సేవలు అందించాలని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని వివిధ సమస్యల పైన పోలీస్ స్టేషన్ వచ్చే ప్రజా సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు, అనంతరం అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన యుగంధర్ మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు ఇప్పటికి అందుబాటులో ఉంటామన్నారు, బద్వేల్ ప్రాంత ప్రజలు తాము బాధ్యతలు చేపట్టినప్పటి నుండి మర్యాదపూర్వకంగా కలుస్తూ పలువురు అభినందనలు తెలియజేయడం తమపై ప్రేమ అభిమానాలు కలిగి ఉండడం తమకు ఎంతో సంతోషకరమన్నారు, బద్వేల్ పట్టణంలో అందరితో ఫ్రెండ్లీ పోలీస్ గా ఉంటూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందిస్తామన్నారు.

# విద్యార్థులు పోటీల్లో ప్రతిభ చూపాలి

వేంపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త :



విద్యార్థులు వకృత్తవ పోటీల్లో ప్రతిభ చూపాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం నారాయణమ్మ సూచించారు. వకృత్వ, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే విద్య పట్ల శ్రద్ధ చూపుతూ అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

# కృష్ణంపల్లెలో భవిష్యత్తుకు గ్యారెంటీ



దువ్వూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో మైదుకూరు తెదేపా ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటిస్తూ వైకాపా పాలనలో ప్రజలకు జరుగుతున్న పాలనను వివరించారు. రాక్షస పాలనను అంతం చేసేందుకు తెదేపాకు మద్దతు తెలపాలన్నారు. వైకాపా ఇసుక దోపిడీ, బెదుగు, బలహీన వర్గాలపై దాడులు ఎక్కువయ్యాయని తెలిపారు. ప్రశ్నించినందుకు తెదేపా నాయకులపై కేసులు పెడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపాకు రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు. గతంలో ఎంతో అభివృద్ధి చేశానని మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ రమణయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల్లో అన్యమతస్తులకు పదవులు ఇవ్వకూడదు



పులివెందుల, ఆగస్టు 31, ప్రభాతవార్త :

దేవాలయాల్లో అన్యమస్తులకు పదవులు ఇవ్వకూడదని హిందూసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు హిందూ సంఘ నాయకులు వంగల శశిభూషణ్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు పేర్కొన్నారు. పులివెందులలో గురువారం వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం హిందూ దేవాలయాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారుస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి పాలక మండలి అధ్యక్షునిగా, సభ్యులుగా అన్యమస్తులను నియమించడం తగదన్నారు. ఇందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా హిందూ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో పులివెందులలో సంతకాలు సేకరించారు. ఈకార్యక్రమంలో తేరా మహేశ్వరరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీరాములు, నవీన్, విష్ణు, కె.వి.రమణారెడ్డి, పాల్గొన్నారు.

# ఆకేపాటి ఐ క్యాంపులో శస్త్ర చికిత్సలు ప్రారంభం

రాజంపేట అర్బన్, ఆగస్టు 31 ప్రభాతవార్త



గత 3 రోజులుగా ఆకేపాటి ఎస్టేట్‌లో నిర్వహిస్తున్న మెగా ఉచిత నేత్ర వైద్యశిబిరంలో గురువారం నుంచి మొబైల్ ఆపరేషన్ వాహనంలో శస్త్ర చికిత్సలను ప్రారంభించారు. చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యబృందం ఆధ్వర్యంలో ఆపరేషన్‌లను నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ల కార్య క్రమం ప్రారంభించిన వెంటనే పూర్తయిన వారిని జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆయన సోదరుడు అనిల్‌కుమార్‌రెడ్డి ఆపరేషన్‌కు ఆర్థిక సహకారం అందిస్తున్న రమేష్‌రెడ్డిలు పరామర్శించారు. ఇంకా 3 రోజుల పాటు అర్హులైన అందరికి ఆపరేషన్‌లు పూర్తి చేస్తామని అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. అందరికి ఆపరేషన్‌లు పూర్తి చేసేంతవరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

# భార్యపై కొడవలితో భర్త దాడి

### పరిస్థితి విషమం : పోలీసుల అదుపులో భర్త

మదనపల్లెక్రైం, ఆగస్టు 31 ప్రభాతవార్త :



భార్యపై భర్త కొడవలితో దాడి చేసి హత్యాయత్నంకు పాల్పడిన సంఘటన గురు వారం మదనపల్లె పట్టణంలో చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన మహిళను తిరు పతికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. ఈ సంఘటనకు బాధ్యడైన భర్తను పోలీసులు అదుపులోకి తీసు కుని విచారణ చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. పట్టణంలోని బాపూజి మున్సిపల్ పార్క్ సమీపంలో నివాసం వున్న రఘు, భార్య లక్ష్మిదేవి (53)లు పండ్ల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరిద్ద రి మధ్య కుటుంబకలహాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం రఘు భార్య లక్ష్మిదేవిని కొట్టి ఇంట్లో నుంచి తరిమివేశాడు. అప్పటి నుంచి ఎదురుగా వున్న బంధువుల ఇంట్లో ఉంటోంది. గురువారం తెల్లవారుఝామున రఘు కొడవలితో భార్యపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో లక్ష్మిదేవి తీవ్రంగా గాయపడటంతో అమెను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సలు చేసిన వైద్యులు అమె పరిస్థితి విషమంగా వుందని తిరుపతికి తరలించారు. విష యం తెలుసుకున్న రెండవ పట్టణ ఇన్‌చార్జ్ మహిబూబ్‌బాషా సంఘటన స్థలం చేరుకుని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# భూ రికార్డు లేకుండా యంత్రాలతో భూములు

### చదును చేస్తే యంత్రాల యజమానులపై చర్యలు

### - తహసీల్దార్ పుల్లారెడ్డి

ఓబులవారిపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలంలో ఉన్న 22 పంచాయతీల్లోని రెవెన్యూ పరమైన రికార్డులు లేకుండా ప్రభుత్వ ప్రైవేటు చెరువులు, కుంటలు భూములను ఆక్రమించి చదును చేస్తే యంత్రాల యజమానులపై భూములు చదును చేస్తున్న వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ పుల్లారెడ్డి హెచ్చరించారు. ఇటీవల మండలంలో ఎక్కడ చూసినా యంత్రాలతో ఖాళీ స్థలం కనిపిస్తే కన్నేసి అక్రమార్కులు ఎత్తేస్తున్నారన్నారు. చిన్న ఓరంపాడు పొలంలో ఎంత మంది అధిక సంఖ్యలో దళితులకు సంబంధించిన భూములుగా ఎటువంటి రికార్డులు లేకుండా భూములు చదును చేస్తున్నట్లు తమ దృష్టికి దళిత నాయకులు, భూములకు చెందిన దళితులు ఫిర్యాదు చేవారన్నారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు లేకుండా సానుకూలంగా పరిష్కరించుకోవాలని ఏమైనా తమ హక్కు కలిగిన భూ పత్రాలను వారి వద్ద రికార్డులను తీసుకొచ్చి రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో సర్వే చేయించి వారి భూములు చదును చేసుకోవాలని ఆయన సూచించారు.

# ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

పెండ్లిమర్రి, ఆగస్టు 31, ప్రభాతవార్త:



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం నంది మండలంలో 3వ రోజు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎవరైనా అర్హులకు అందకుంటే తెలపాలన్నారు. అధికారులతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలుంటే తెలపాలని ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మన్ బాలయ్య, సి.కె.దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, నందిమండలం సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శావలి శివ, సింగిల్ విండో అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, తహసీల్దార్ ఉదయ్‌బాస్కర్‌రాజు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యోగివేమన విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా కొండపల్లి చిన్నసుబ్బారావు

బద్వేల్ అర్బన్, ఆగస్టు 31 ప్రభాతవార్త



ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కొండపల్లి చిన్న సుబ్బారావు పార్టీలో చేసిన సేవలను గుర్తించి వారికి కడప జిల్ల యోగివేమన విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమించారు, గురువారం ఉత్తర్వులు జారీ కావడంతో కొండపల్లి చిన్న సుబ్బారావుకు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారస్తులు, నాయకులు, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు, గురువారం సాయంత్రం కొండపల్లి చిన్న సుబ్బారావుకు ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ కమిటీ సభ్యులు దిండుకుర్తి సుబ్బరాయుడు మాజీ సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు మాజీ జాయింట్ సెక్రెటరీ సగల గోవిందస్వామి మాజీ వైస్ ప్రెసిడెంట్ మాలేపాటీ వెంకటేశ్వర్లు,గుబ్బ వెంకటేశ్వర్లు, మరియు వార్త విలేఖరి రమణ తోపాటు పలువురు కమిటీ సభ్యులు, పట్టు శాలువాతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు, ఈ సందర్భంగా యోగివేమన విశ్వవిద్యాలయం కౌన్సిల్ మెంబర్ గా నియమితులైన కొండపల్లి చిన్న సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధ మరియు పలువురు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో వైయస్సార్సీపి పార్టీ లోకి చేరడం జరిగిందన్నారు, పార్టీలో తాము చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్సీ డి,సి గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధ మున్సిపల్ చైర్మన్ వాకమల రాజగోపాల్ రెడ్డి, అడా చైర్మన్ గురు మోహన్, సీనియర్ న్యాయవాది పి,వి,ఎన్ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ, స్టేట్ ఆర్యవైశ్య మహాసభ జిల్లా జనరల్ సెక్రెటరీ మిట్ట కరుణాకర్, తో పాటు పలువురు నాయకులు తమకు ఈ పదవి రావడానికి కృషి చేయడం సంతోషకరమని వారు పలువురికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు, ఎమ్మెల్సీ ,ఎమ్మెల్యేకి ఎంతో రుణపడి ఉంటామని యోగివేమన యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

# హిందూ ధర్మంపై విషప్రచారం తగదు



వేంపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త :

ధర్మప్రచారం పేరుతో హిందూ ధర్మంపై విష ప్రచారం జరుగుతోందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ అన్నారు. గురువారం వేంపల్లె పట్టణంలోని గీత నీజ్ఞాన అమృతం పేరుతో కొంతమంది పుస్తకాలు అమ్మడం చూసి వాటిని పరిశీలిస్తే అందులో మొత్తం అన్యమత ప్రచారానికి సంబంధించిన విషయాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకు భగవద్గీత ఇస్తామని, మాయ మాటలు చెప్పి గీత పేరుతో హిందువులను మతమార్పిడిలకు ప్రేరేపిస్తున్నారని చెప్పారు. ఇలాంటి వాటిని ప్రతిఘటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుష్మా, రామచంద్రారెడ్డి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఎన్.సునీల్‌కుమార్, చరణ్, శశి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో మెలగాలి

రాయచోటి, ఆగస్టు 31 ప్రభాతవార్త



ప్రస్తుత సమాజంలోని విద్యార్థులు క్రమశిక్షణ అంకితభావంతో తరగతి గదిలోని పాఠాలను ప్రయోగశాల యందు అవగాహనతో విద్యను అభ్యసించాలని అనంతపురం జేఎన్టీయూ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ టి నారాయణ రెడ్డి కోరారు రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థిని విద్యార్థుల కోసం ఇండక్షన్(ప్రేరణ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్టీయూ అనంతపూర్ కళాశాల మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ టి.నారాయణ రెడ్డి విశిష్ట అతిథిగా డైట్ కళాశాల అధ్యాపకులు జనార్ధన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులను ఉద్దేశించి నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అకడమిక్ ప్రాజెక్ట్స్ ను అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని టెక్నాలజీని ఎప్పటికప్పుడు పునఃశ్చరణ చేసుకొని సాంకేతికంగా ఎదురయ్యే సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు. నిజజీవితంలో దగ్గరగా చూసే టెక్నికల్ అంశాలను ఇండక్షన్ కార్యక్రమం ద్వారా సారూప్యత గమనించ వచ్చని అభిప్రాయపడ్డారు. అనంత రం జనార్దన్ రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన పెంపొందించుకొని, బృంద చర్చలలో పాల్గొని సాఫ్ట్ స్కిల్స్ ను వృద్ధి చేసుకోవాలని తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ఎం . సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కోర్సులో మొదటి సంవత్సరం నుండే ప్రతి విద్యార్థి ప్రణాళికను సిద్ధం చేసుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచి ,టెక్నికల్ ప్రదర్శనలు యందు పాల్గొని వివిధ ఆవిష్కరణలను విశ్లేషించి తదుపరి నవీకరణకు శోధన చేయాలని సూచించారు. శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతోమంది సాఫ్ట్వేర్, బ్యాంకింగ్, ప్రభుత్వ , ప్రైవేటు ,అఖిల భారత సర్వీసులు యందు అత్యున్నత హోదాలో స్థిరపడ్డారని యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్స్ మరియు ప్రతిభ అవార్డులు సాధించారని వివరించారు. ప్రస్తుతం విద్యార్థులకు పారిశ్రామిక అవసరాలను తీర్చే పాఠ్యాంశాలను ప్రవేశపెట్టి ప్రయోగశాలలకు అధిక ప్రాముఖ్యత ఇచ్చిందని, కావున దీనికి అనుగుణంగా మొదటి సంవత్సరం నుండే కోడింగ్ ప్రోగ్రామింగ్ విభాగాలు యందు ప్రత్యేక శిక్షణ మరియు వనరులు కల్పిస్తున్నామని తెలియజేశారు. మార్కుల కోసం కాకుండా తరగతి అంశాలపై పూర్తిస్థాయిలో విషయపరిజ్ఞానాన్ని విపులంగా బోధించడమే ధ్యేయంగా ముందుకెళుతున్నామని వివరించారు. తమ కళాశాల శిక్షణ సంస్థలతోఎంఓయూ ఏర్పరచుకుని 100% ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి సంవత్సరం అపేక్ష లాంటి టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్ మరియు సింపోజియం ద్వారా విద్యార్థుల నైపుణ్యతను మరియు సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సాహాన్ని అందిస్తామని వివరించారు .రెండవ సంవత్సరం నుండి ఉద్యోగ అవకాశాల కోసం కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్ ,రీజనింగ్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ ,వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్యాబ్‌ల వినియోగంతో నాణ్యమైన విద్య

### జిల్లా నోడల్ అధికారి సుధాకర్ వెల్లడి

సంబేపల్లి, ఆగస్టు 31, ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్ ల వినియోగం వలన నాణ్యమైన విద్య సమకూరుతున్నదని, విద్యా ప్రమాణాలు పెంపొందుతున్నాయని అన్నమయ్య జిల్లా బైజూస్ నోడల్ ఆఫీసర్ చిట్లూరి సుధాకర్ తెలిపారు. గురువారం ఉదయం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ట్యాబ్ ల వినియోగంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ట్యాబ్ లో ఇచ్చిన కంటెంట్ తప్ప ఇంటర్నెట్ కంటెంట్ ను అప్లోడ్ చేసేందుకు, డౌన్లోడ్ చేసేందుకు అవకాశం లేకుండా ట్యాబ్ ల సాఫ్ట్ వేర్ ను రూపొందించడం జరిగిందన్నారు. సరైన అవగాహన లేకపోవడం వల్ల కొందరు విద్యార్థులు యాప్స్ లను డౌన్లోడ్ చేసేందుకు ప్రయత్నించడంతో కొన్ని ట్యాబ్ లలో సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తి పని చేయలేదన్నారు. ఎక్కడ తప్పు జరిగింది విద్యార్థులు గుర్తించలేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పుడు అన్ని ట్యాబ్ లలో గూగుల్ అథంటికేటర్ సాఫ్ట్వేర్ ను అప్లోడ్ చేస్తున్నామన్నారు. దీని తర్వాత విద్యార్థి తమ దగ్గర ఉన్న ట్యాబ్ లలో మార్పులు చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయులకు, రాష్ట్రస్థాయిలోని కమాండ్ కంట్రోల్ సిబ్బందికి, మండల స్థాయిలో ఐటి సహాయకులుగా పనిచేసే ఉపాధ్యాయులకు సమాచారం వెళుతుందన్నారు. దీంతో ఏ పాఠశాలలో , ఏ విద్యార్థి తప్పు చేసారో సులభంగా తెలిసిపోతుందన్నారు. ట్యాబ్ లలో ఏవైనా మరమ్మతులు అవసరమైతే సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ కు ఇవ్వాలన్నారు. వాటిని వారు ఉచితంగా మరమ్మతులు చేసి తిరిగి ఇస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో వారు ముఖాముఖి మాట్లాడారు. ట్యాబ్ ల వినియోగంపై విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్ లను సక్రమంగా ఉపయోగించుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ డిస్టిక్ నోడల్ ఆఫీసర్ అశోక్ రెడ్డి, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కమలాపురంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

కమలాపురం, ఆగస్టు 31, ప్రభాతవార్త:



తహసీల్దారు కార్యాలయంలో గురువారం కలెక్టర్ విజయరామరాజు, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, నియోజవర్గంలోని ఓటర్ల జాబితా, పోలింగ్ బూతుల వివరాల గురించి స్థానిక తహసీల్దార్ సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించి నూతన ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. అక్కడి నుంచి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు సందర్శించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రభుత్వ అధికారులు, స్థానిక ఉపాధ్యాయులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ చేతిలో జగన్,చంద్రబాబు, పవన్‌లు కీలుబొమ్మలు

### - డా.నర్రెడ్డి తులసిరెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 31, ప్రభాతవార్త:



బీజేపీ చేతిలో (మోదీ, అమిత్‌షా) జగన్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు కీలుబొమ్మల్లా, కబాళీలుగా మారారని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ మాజీ రాజ్యసభ సభ్యులు డా.నర్రెడ్డి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం జమ్మలమడుగు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నియోజకవర్గ కోఆర్డినేటర్ మంచాల పుష్పరాజ్ అధ్యక్షతన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మోదీ, అమిత్‌షాల ప్రాపకం కోసం, దయాదాక్షిణ్యాల కోసం పై ముగ్గురు తె ఆరాటపడి పోతున్నారన్నారు. జగన్‌రెడ్డి భజన్‌రెడ్డిగా, చంద్రబాబునాయుడు చెక్క భజన నాయుడులా మారడం శోచనీయమన్నారు. మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం, కార్పొరేట్ శక్తులకు కట్టడం ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు సుబ్రమణ్యం శర్మ, నజీర్, పుష్పరాజ్, సుబ్బారావు, రాజేష్, మహేష్ నాయుడు, ఉత్తన్న, సుబ్బరాయుడు, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

### ఎమ్మెల్యే శెట్టిపట్టి రఘురామిరెడ్డి

మైదుకూరు ఆగస్టు 31, ప్రభాతవార్త



అభివృద్ధి సంక్షేమం మాకు రెండుకళ్ళు లాంటివని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ వనిపెంట రోడ్డులో గల అంకాలమ్మ దేవాలయం నుండి నానుబాలపల్లి ఎస్సి కాలనీ వరకు గల 1860మీటర్ల బి.టి రోడ్డు నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరము మీడియాతో మాట్లాడుతూ మున్సిపాలిటీని అభివృద్ధిలోనూ, సంక్షేమంలోనూ సస్యశ్యామలంగా ముందుకు తీసుకెళ్లగలుగుతున్నామని అభివృద్ధిలో భాగంగా సి.సి రోడ్లు, డ్రైనేజీ, పార్క్, విద్యుత్ ఎర్రచెరువు పార్క్ సుందరీకరణ వాటిని అభివృద్ధి చేశామన్నారు. 19కోట్ల 40లక్షల రూపాయలతో కడప బైపాస్ రోడ్డు నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు 4రోడ్డు విస్తారం పనులకు ఆమోదం లభించిం దన్నారు, రోడ్డు మధ్యలో బటర్ ఫ్లై లైట్స్‌తో రోడ్డు వెడల్పు చేస్తున్నామన్నారు. ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిం చామన్నారు. 2014నుండి 2019 వరకు ఉన్న ప్రభుత్వం రూపాయి కూడా మున్సిపాలిటీకి ఖర్చు పెట్టిన పాపానా పోయింద అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి,చేపల షరీఫ్, వార్డు కౌన్సిలర్ లు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలి: ఎస్టీయు

పోరుమామిళ్ళ రూరల్, ఆగస్టు 31ప్రభాతవార్త:

ఇచ్చిన హామీల మేరకు కెజిబివిలు, ఎంఈవో ఆఫీసులు, పాఠశాలల యందు పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పి. రమణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పోరుమామిళ్ళలోని ఎస్టీ భవన్‌లో నిర్వహించిన సపమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే కా ంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం కొంత మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు రీజనల్ కన్వీనర్, కోకన్వీనర్ కె. పుల్లయ్య, కె. వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు బి. సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, పోరుమామిళ్ళ అధ్యక్షుడు జయరామిరెడ్డి, వెంకటరామయ్య, బాలచెన్నయ్య పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

వీరపునాయునిపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త :

ఉద్యాన పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏపీ మైనింగ్ డైరెక్టరు వీరప్రతాప్‌రెడ్డి అన్నారు. వీరపునాయునిపల్లె మండల కేంద్రంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆర్థిక సహాయంతో కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న మూడోరోజు శిక్షణ కార్యక్రమానికి ఈయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్, ప్రసంగించారు. అరటి, దానిమ్మ పంటలకు మండలంలోని భూములు అనుకూలంగా ఉన్నాయన్నారు.